Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కాలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

ఆదివారం | 08-11- 2026 | సంపుటి: 17, సంచిక: 218, పేజీలు: 12, వెల: 3/-



ఈ20 కాదు.. 420

ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20శా పరిమితికి మించి ఇథనాల్‌ను కలుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. కేంద్రం చెబుతున్న ఈ-20 విధానం (పెట్రోల్‌లో 20శా ఇథనాల్ మిశ్రమం) ఈ-420గా (మోసం) మారిందని ఎక్స్ వేదికపై చేసిన పోస్టులో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వం పెట్రోల్ బంకుల నుంచి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించగా, నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లుగా వెల్లడైందని రాహుల్ గాంధీ తెలిపారు. 14 నమూనాలను పరీక్షించగా.. 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 దాటినట్లు వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్)కు చెందిన నమూనాల్లో 31.2శాతం, హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) నమూనాల్లో 30.5శాతం ఇథనాల్ ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలైన నయారా, షెల్ విక్రయ కేంద్రాల నుంచి సేకరించిన నమూనాల్లోనూ 20 శాతానికి పైనే ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు.

సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని

అన్ని జిల్లాల్లో పర్యటిస్తా..

ప్రజాబలం అని కొత్త కార్యక్రమాన్ని ప్రకటించిన సీఎం రేవంత్



ప్రజల్లోకి వెళ్లి సమస్యలు నేరుగా తెలుసుకుంటా

ఎల్‌నినో కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం

యాసంగిలో రైతులు ఆరుతడి పంటలే వేయాలి

రూ.10 వేల కోట్లతో కొడంగల్‌లో పనులు

గడ్డం పెంచుకుంటే కేటీఆర్ రేవంత్ కాలేడు

లగచర్ల రైతు మేళాలో రేవంత్‌రెడ్డి ప్రసంగం


హైదరాబాద్, నవంబరు 7 (ప్రజాకలం) :

సంక్రాంతి పండగ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం ప్రజాబలం అని కొత్త కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటామని చెప్పారు. కరువు పరిస్థితులు ఏర్పడితే ప్రతి ఎమ్మెల్యే, మంత్రి, ప్రజాప్రతినిధి ప్రజల మధ్య ఉండాలన్నారు. ముఖ్యమంత్రిగా తాను కూడా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలం లగచర్ల-హకీంపేట హబ్‌లో మూడు రోజుల పాటు కొనసాగనున్న మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అందరం కలిసికట్టుగా ఎల్‌నినోను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరి పోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత మండిపోతాయని, నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైతులు ఆరుతడి పంటలు వేయాలని, వేరే పంటలు వేస్తే పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదని చెప్పారు. అధిక దిగుబడినిచ్చే పంటలను ఎంచుకుని ఆధునిక సాగు పద్ధతులు పాటించాలన్నారు. తాండూరు కందిపప్పుకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని,

తరువాయి 2వ పేజీలో...

వరి ధాన్యం నిల్వకు రాష్ట్రవ్యాప్తంగా

ఆధునిక సైలోలు



తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకే ప్రాంగణంలో సదుపాయాలు

పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు

సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 7 (ప్రజాకలం) :

వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి, నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తోంది. శనివారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై సమీక్షించారు. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

ధాన్యం సైలోలోకి ఎలా చేరుతుంది?

ధాన్యాన్ని పెద్ద మొత్తంలో నేరుగా నిల్వ చేయగల భారీ ఉక్కు గిడ్డంగులే సైలోలు. ప్రతిపాదిత సైలో కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం పంతెనలు,

తరువాయి 2వ పేజీలో...

జిల్లాల మధ్య నీటి వివాదాలు

సృష్టిస్తున్నారు

తొమ్మిది సర్వేలు చేసినా డిండికి నీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలో చెప్పలేదు

ఏదుల నుంచి డిండికి నీళ్లు తెస్తామన్న సీఎం..: కల్వకుంట్ల కవిత

డిండి, నవంబరు 7 (ప్రజాకలం) :

ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నిరర్థక ఆస్తి(నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్)గా మిగిలిపోయిందని తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.



తరువాయి 2వ పేజీలో...

కూటమి జైత్రయాత్ర

కనీస స్థానాలూ దక్కించుకోలేని వైసీపీ

పలు జిల్లాల్లో ఒక్క జడ్పీటీసీ కూడా గెలవని వైనం

మండల పరిషత్‌లలోనూ అధికార కూటమి హవా

'పుర' సమరాన్ని మించిభారీ విజయం నమోదు



హైదరాబాద్, నవంబరు 7 (ప్రజాకలం) :

'స్థానిక' సమరంలో కూటమి జైత్రయాత్ర కొనసాగుతోంది. మొన్నటికి మొన్న 'పుర' పోరులో గెలుపు హోరెత్తించిన కూటమి... పల్లెనాడిని పట్టే 'పరిషత్' ఎన్నికల్లోనూ విజయ దుందుభి మోగించింది. రాష్ట్రంలో 28 జిల్లాలు ఉండగా... 27 జడ్పీ పీఠాలపై కూటమి జెండా ఎగరడం ఖాయమైంది. గురువారం జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 8 గంటలకు మొదలైంది. పోస్టల్ బ్యాలెట్‌ల నుంచే కూటమి అభ్యర్థుల ప్రభంజనం కనపడింది. శ్రీకాకుళం నుంచి అనంతపురం దాకా... ఒక్క అల్లూరి జిల్లా మినహా రాష్ట్రమంతా ఇదే పరిస్థితి. అల్లూరి జిల్లా జడ్పీ పీఠం మాత్రమే వైసీపీ ఖాతాలో పడే అవకాశం కనిపిస్తోంది. ఇక ఇతర జిల్లాల్లో ఎక్కడా గౌరవనీయ స్థాయిలో జడ్పీటీసీ స్థానాలు దక్కించుకున్న దాఖలాలు లేవు. ఎంపీటీసీలదీ అదే పరిస్థితి. చివరికి... జగన్ సొంత గడ్డ పులివెందుల జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లోనూ వైసీపీ గల్లంతైపోయింది. శనివారం అర్ధరాత్రి సమయానికి అందిన సమాచారం మేరకు... రాష్ట్రంలోని మొత్తం 659లలో ఏకగ్రీవాలతో కలిపి దాదాపు 580 స్థానాలు కూటమి పరమయ్యాయి. వైసీపీ 61 స్థానాలతో సరిపెట్టుకుంది. ఇక... 9821 ఎంపీటీసీ స్థానాలకుగాను 2051 స్థానాలు ఏకగ్రీవం కాగా... 7767 స్థానాల్లో పోలింగ్ జరిగింది.

తరువాయి 2వ పేజీలో...

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే

ప్రజా ప్రభుత్వ సంకల్పం

పేదల ఇళ్లలో దీపావళి వెలుగులు నింపేందుకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొననున్న మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబరు 7 (ప్రజాకలం) :

రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే గొప్ప సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని.. ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భరోసా కల్పించే చిరునామా అని మంత్రి పేర్కొన్నారు. పేదల కష్టాలను అర్థం చేసుకుని, వారి సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రూపొందించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యాచరణలో పెట్టి, అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంపై శనివారం నాడు సచివాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు.

తరువాయి 2వ పేజీలో...

అమెరికా మార్కెట్లకు ఎన్నికల సెగ



ప్రపంచ మార్కెట్లలో ప్రకంపనలు.. భారత్‌లో రూ.28.7 లక్షల కోట్ల సంపద పెరుగుదల!

న్యూఢిల్లీ : ఈ వారం అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు, భారత మార్కెట్లు భిన్నమైన దిశల్లో పయనించాయి. అమెరికాలో ఏఐ రంగంలో భారీ పెట్టుబడులపై ఆందోళనలు, విధానపరమైన మార్పుల అంచనాలతో టెక్నాలజీ షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. ఏప్రిల్ 2025 తర్వాత అమెరికా మార్కెట్లు అతిపెద్ద వారపు పతనాన్ని నమోదు చేశాయి. గురువారం ఒక్కరోజే ఎస్ అండ్ పీ 500 కంపెనీల మార్కెట్ విలువలో దాదాపు 3 లక్షల కోట్ల డాలర్లు ఆవిరయ్యాయి. ఈ ప్రభావం ఆసియా మార్కెట్లకూ విస్తరించింది. మరోవైపు అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత స్టాక్ మార్కెట్లు మాత్రం వారమంతా లాభాల బాటలో సాగాయి. ఈ వారంలోని ఐదు ట్రేడింగ్ సెషన్లలోనూ సూచీలు పెరిగాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ గత ఆరేళ్లలోనే అత్యధిక వారపు లాభాలను నమోదు చేశాయి.

అమెరికాలో ఏఐ భయాలు.. భారీగా నష్టాలు

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం తర్వాత ఏఐ రంగంపై నియంత్రణలు పెరిగే అవకాశం ఉందనే అంచనాలు మార్కెట్లను ప్రభావితం చేశాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకత, విధానపరమైన మార్పుల సూచనలు టెక్నాలజీ కంపెనీల వృద్ధి అవకాశాలపై అనిశ్చితిని పెంచాయి. ముఖ్యంగా ఏఐ వ్యవస్థలకు అవసరమైన చిప్‌లు, ఇతర పరికరాలను సరఫరా చేసే సంస్థల భవిష్యత్తుపై మదుపరుల్లో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో టెక్నాలజీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఎన్నికల ఫలితాల అనంతరం తొలుత మార్కెట్లు సానుకూలంగా స్పందించినప్పటికీ.. గురువారం పరిస్థితి ఒక్కసారిగా మారింది. టెక్నాలజీ దిగ్గజాల షేర్లలో భారీ విక్రయాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం ఎస్ అండ్ పీ 500 సూచీ 0.3 శాతం కోలుకున్నప్పటికీ.. వారాంతానికి 2.7 శాతం నష్టంతో ముగిసింది. నాస్‌డాక్ 100 సూచీ చివరి ట్రేడింగ్ సెషన్‌లో 1.35 శాతం పెరిగినా.. వారానికి 4.91 శాతం నష్టపోయింది. అంతకుముందు రోజు టెక్నాలజీ షేర్లలో నమోదైన పతనం కొవిడ్ మహమ్మారి తర్వాత అతిపెద్ద ఒక్కరోజు నష్టాల్లో ఒకటిగా నిలిచింది. గురువారం నాటి అమ్మకాలతో ఎస్ అండ్ పీ 500లోని కంపెనీల మార్కెట్ విలువలో దాదాపు 3 లక్షల కోట్ల డాలర్లు తగ్గిపోయాయి.

తరువాయి 2వ పేజీలో...

విద్యారంగంలో కీలక

సంస్కరణలు: భట్టి



హైదరాబాద్, నవంబరు 7 (ప్రజాకలం) :

విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చేపడుతోన్న సంస్కరణలు... రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు దోహదపడతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 15న నగరంలో జరగనున్న తెలంగాణ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్‌రాష్ట్ర విద్యా మహాసభ పోస్టర్‌ను డిప్యూటీ సీఎం శనివారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి పోచయ్య పాల్గొన్నారు.

నైనీ గని నుంచి బొగ్గు అధికోత్పత్తికి

అన్ని రకాల చర్యలు

ఎల్ నినో నేపథ్యంలో రోజుకు కనీసం 20 వేల టన్నుల బొగ్గు తెలంగాణకు రవాణా జరపాలి

సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 7 (ప్రజాకలం) :

ఒడిశా రాష్ట్రంలోని నైని బొగ్గు బ్లాక్ నుండి ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యాల మేర బొగ్గు అధికోత్పత్తి సాధించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఓవర్ బర్డెన్ తొలగింపును పెంచాలని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన నైనీ గని పై సంస్థ డైరెక్టర్లు మరియు సంబంధిత

తరువాయి 2వ పేజీలో...

సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తా..

మొదటి పేజీ తరువాయి...

తాండూరు, కొడంగల్, పరిగి ప్రాంతాల జొన్నలు, సజ్జలు, కందులు, జొన్న రొట్టెలకు ప్రత్యేకత ఉందని, రైతులు అనుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొంటే ఒక్క తెలంగాణలోనే వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "బావబామ్మర్దులు ఊర్ల మీద పడి అబద్ధాలు, అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు. వారి మాటలు నమ్మితే మట్టిపోసి అంబలి కాచుకున్నట్లే" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పాలనలో కమీషన్లకు కక్కుర్తి పడడం వల్లే కరువు సమయంలో కాళేశ్వరం నుంచి చుక్కనీరు ఇవ్వలేని దుర్భర పరిస్థితి ఏర్పడిందని సీఎం ఆరోపించారు.

కేంద్రం జాతీయ ప్రాజెక్టు హోదా ఇస్తామన్నా లెక్కచేయకుండా కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్లను పక్కనబెట్టి, పేరు, ప్రాంతం, అంచనాలు మార్చి కాళేశ్వరం కట్టారన్నారు. "కాళేశ్వరం కట్టింది వాళ్లే.. కూలింది వాళ్ల హయాంలోనే" అన్నారు. మేడిగడ్డ వద్ద ఒక్క ఎకరా ఆయకట్టు కూడా లేదని, అన్నారం, సుందిళ్ల వద్దా లేదని, మరి ఈ బ్యారేజీలు గాడిదలు కాయడానికి కట్టారా అని ప్రశ్నించారు. మూడు బ్యారేజీల్లో గేట్లు దించి, మూడు పంప్‌హౌస్‌లు ఏకకాలంలో పనిచేస్తేనే శ్రీపాద ఎల్లంపల్లి నిండుతుందని, మేడిగడ్డలో 16 టీఎంసీలు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోయగలమని వివరించారు. మేడిగడ్డ వద్ద ఎత్తిపోయక పోవడం వల్లే నీళ్లు ఏపీకి పోతున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణలు అబద్ధమని, ఆ పార్టీ నేతలకు కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఆనాడు 'కాళేశ్వర్‌రావు'గా పొగిడించుకున్న హరీశ్‌రావు ఇప్పుడు మేడిగడ్డ పేరెత్తితే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన తుపాకులగూడెం-దేవాదుల, జలయజ్ఞంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొదలుపెట్టిన రాజీవ్‌సాగర్ (ఇప్పటి సీతారామ) ప్రాజెక్టులే ఇప్పుడు లక్షల ఎకరాలకు నీరిస్తూ ఖమ్మం జిల్లా రైతులను ఆదుకుంటున్నాయని చెప్పారు. కాళేశ్వరం అవకతవకలపై విచారణకు ఆదేశిస్తే, సీబీఐ విచారణ జాప్యం కోసం ఢిల్లీలో మోదీ ముందు మోకరిల్లింది మీరు కాదా అని బీఆర్ఎస్‌ను నిలదీశారు. పదేళ్లలో రాష్ట్ర బడ్జెట్ రూ.20 లక్షల కోట్లకు పైగా ఉన్నా పాలమూరులో ఒక్క సాగునీటి ప్రాజెక్టూ పూర్తి చేయలేదని, ఎస్ఎల్‌బీసీ, డిండి, అచ్చంపేట ఎత్తిపోతలు పూర్తిచేసి ఉంటే నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు.

22ఏపై అసెంబ్లీలో చర్చకు రండి

22ఏ భూములపై కొందరు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అసెంబ్లీలో చర్చకు వస్తే వాస్తవాలన్నీ ప్రజల ముందుంచుతామని సీఎం సవాల్ విసిరారు. డిసెంబరులో రెండు మూడు రోజుల పాటు ఎల్‌నినో, కాళేశ్వరం, ప్రాణహిత నీళ్లపై చర్చకు అవకాశం ఇవ్వాలని వేదికపై ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. చర్చకు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ తమ తాతముత్తాతలను, చుట్టాలను వెంటబెట్టుకుని వచ్చినా అనుమతించాలని, అసెంబ్లీలోనే వాళ్ల సంగతి తేలుస్తామని అన్నారు.

గడ్డం పెంచితే రేవంత్ కాలేవు

కేటీఆర్‌పై సీఎం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కన్సల్టెంట్లతో ఫైవ్‌స్టార్ హోటల్లో సమావేశం పెడితే 'ఆ సార్‌కు గడ్డం ఉంది, నీకు లేదు' అని చెప్పారని, అందుకే ఇప్పుడు గడ్డం పెంచుతున్నారని ఎద్దేవా చేశారు. పులిని చూసి వాతలు పెట్టుకున్న నక్క కథ చెప్పి.. "పది జన్మలెత్తినా నువ్వు తారకరామారావువే గానీ రేవంత్‌రెడ్డివి కాలేవు. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకునే ధైర్యం, నమ్మినవారి కోసం నిలబడే తత్వం ఉంటేనే రేవంత్‌రెడ్డి అవుతారు" అన్నారు. ఈ చిల్లర వేషాలేంటని కొడుకును కేసీఆర్ మందలించాలని సూచించారు. పదేళ్లలో ఇంటిల్లిపాదీ తెలంగాణను దోచుకుని లక్ష కోట్లు సంపాదించుకున్నారని, పీకల దాకా పాతిపెడితేనే వాళ్ల పాపాలు పోతాయని విమర్శించారు. ఖమ్మంలో గిట్టుబాటు ధర అడిగిన రైతులకు బేడీలు వేసిన సంగతిని ప్రజలు మరిచిపోలేదని, వరి వేస్తే ఉరేనన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో వందల ఎకరాల్లో వరి పండించుకోలేదా అని ప్రశ్నించారు.

కొడంగల్‌కు కేసీఆర్ ద్రోహం

2009లో పాలమూరు ప్రజలు విఠల్‌రావును కాదని కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపారని, కానీ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల్లో ఒక్కటీ పూర్తి చేయలేదని సీఎం విమర్శించారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవన్నారు. వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్, టేకుల్‌కోడ్ సిమెంట్ ఫ్యాక్టరీ, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలను అడ్డుకున్నది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.2 లక్షలు కూడా ఇవ్వలేదని, మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించి భూసేకరణ పూర్తి చేశామని, ఇప్పుడు ఎత్తిపోతల పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు నిగ్గుచేటన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ఎన్నికైన ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు పనిచేసిన తర్వాత ఈ ప్రాంతానికి మళ్లీ అంత పెద్ద అవకాశం ఇప్పుడే దక్కిందని, దాన్ని ప్రాంత అభివృద్ధికి వినియోగిస్తానని చెప్పారు.

దేశానికే తలమానికంగా కొడంగల్

ఢిల్లీ-నోయిడా, ముంబై-పుణె తరహాలో హైదరాబాద్-లగచర్ల మధ్య పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని, రూ.10 వేల కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభించబోతున్నామని సీఎం తెలిపారు. కొడంగల్ నుంచి అంతర్జాతీయ విమానాశ్రయానికి గంటలో చేరుకునేలా 250 అడుగుల వెడల్పుతో 80 కిలోమీటర్ల కొత్త రహదారికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. లగచర్ల భూముల విషయంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించినా, అభివృద్ధిని చూసి అదే రైతులు భూములిచ్చేందుకు ముందుకొస్తున్నారని చెప్పారు. 943.34 ఎకరాల కొడంగల్ ఇండస్ట్రియల్ హబ్‌లో భూసేకరణకు రూ.220 కోట్లు, రోడ్లు, నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులకు రూ.441.91 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. బిర్లాను లిమిటెడ్ ఫైబర్ సిమెంట్ బోర్డుల పరిశ్రమకు, ఈకో బామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ సంస్థ వెజిటబుల్ ఆయిల్స్ పరిశోధన యూనిట్‌కు కలిపి 96 ఎకరాలు కేటాయించామని, రూ.252.86 కోట్ల పెట్టుబడితో 535 ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. "మీకంటే నాకు ఆత్మ బంధువులు లేరు. పదేళ్లు రాజకీయాలకతీతంగా కొడంగల్‌ను అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా" అన్నారు. అందరికీ ఆదివారం దీపావళి అయితే కొడంగల్‌కు ఒకరోజు ముందే వచ్చిందన్నారు. రైతు మేళాలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, వంశీకృష్ణ, గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లగచర్లలో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీతో రైతులకు మేలు: స్పీకర్ ప్రసాద్ కుమార్

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. లగచర్లలో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఆయిల్‌పామ్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని, ఈ పరిశ్రమ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

కూటమి జైత్రయాత్ర

వరి ధాన్యం నిల్వకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోలు

మొదటి పేజీ తరువాయి...

తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మట్టి, చెత్త వంటి మలినాలను శుభ్రపరిచే యంత్రాలతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని యాంత్రిక పరికరాల సాయంతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెడదను నియంత్రించేందుకు అవసరమైన ఏర్పాట్లనూ ప్రతిపాదించారు.

సైలోల ఏర్పాటుకు రెండు నమూనాలు

మొదటి నమూనాలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేయనుంది.

రెండో నమూనాలో తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించనున్న సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సైలోలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులు ఆర్థికంగా ఆచరణీయమయ్యేందుకు పౌర సరఫరాల సంస్థ నిర్ణీత కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు.

సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు బాధ్యతలను అంచనా వేయాలని మంత్రి అధికారులను కోరారు.

తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలన్నారు.

మార్కెట్ ధర అనుకూలించినప్పుడు అమ్ముకునే వీలు

తాజాగా కోసిన వరి ధాన్యంలో సాధారణంగా సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ఆరబెట్టే, భద్రంగా నిల్వ చేసే సదుపాయాలు లేక చాలామంది రైతులు అప్పటి మార్కెట్ ధరకే, కొన్నిసార్లు కోత ముగిసిన 24 గంటల్లోనే, ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. సైలో కేంద్రాల్లో శాస్త్రీయంగా ఆరబెట్టి నిల్వ చేసే వీలు కలిగితే రైతులు ధర అనుకూలించినప్పుడు ధాన్యాన్ని అమ్ముకోగలుగుతారని చెప్పారు.

ప్రీమియం వరి రకాల ధాన్యంలో తేమ సుమారు 25 శాతం ఉన్నప్పుడు క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే ధాన్యాన్ని శాస్త్రీయంగా ఆరబెట్టి తేమను సుమారు 12 శాతానికి తగ్గిస్తే క్వింటాలుకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ధర పలికే అవకాశం ఉందని వివరించారు.

జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్‌ఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని, కొన్ని మార్కెట్లలో జేఎస్ఆర్ బియ్యం బాస్మతి కంటే అధిక ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరికి మెరుగైన నిల్వ సదుపాయాలు కల్పించడం వ్యవసాయ రంగ వృద్ధికి, రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికి ఇది తోడ్పడుతుందన్నారు.

సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నైనీ గని నుంచి బొగ్గు అధికోత్పత్తికి

అన్ని రకాల చర్యలు

మొదటి పేజీ తరువాయి...


జనరల్ మేనేజర్లతో ప్రత్యేక సమీక్షా నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం నైనీగని నుండి రోజుకు కనీసం 20వేల టన్నులకు పైగా బొగ్గు సరఫరా చేయాల్సిన అవసరం ఉందని, ఈ నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా జరపడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్ బర్డెన్ తొలగింపును పెంచడం వల్ల ఎక్కువ బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది కనుక ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా నైనీ గని జనరల్ మేనేజర్ శ్రీ బైద్య ప్రస్తుతం గనిలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు తదితర అంశాలను వివరించారు. బొగ్గు రవాణా సజావుగా సాగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చైర్మన్ కోరారు. ఈ సమీక్ష కార్యక్రమంలో డైరెక్టర్ టఆపరేషన్స్ఊ శ్రీ ఎల్వి సూర్యనారాయణ, డైరెక్టర్ టప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ఊ శ్రీ కె వెంకటేశ్వర్లు, డైరెక్టర్ టపర్సనల్ మరియు ఫైనాన్స్ఊ శ్రీ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ టఈ అండ్ ఎంఊ, శ్రీ ఎం తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ శ్రీ బి వెంకన్న, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్ శ్రీ తాడబోయిన శ్రీనివాస్ జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ శ్రీ దేవేందర్ ఇంకా వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ సంకల్పం

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసిందని వివరించారు. విడతలవారీగా ఆర్థిక సహాయం అందిస్తూ పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ లక్షలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు కేవలం నివాసాన్ని కల్పించడమే కాకుండా వారి కుటుంబాల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపై భరోసా నింపడమే ప్రభుత్వ అసలైన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

కలం కౌంటర్



అమెరికా మార్కెట్లకు ఎన్నికల సెగ

మొదటి పేజీ తరువాయి...

మార్కెట్ ఒడిదుడుకులను సూచించే సీబీఓఈ వోలాటిలిటీ ఇండెక్స్ (వీఐఎక్స్) కూడా ఏప్రిల్ 2025 తర్వాత అతిపెద్ద పెరుగుదలను నమోదు చేసింది. హెడ్జ్ ఫండ్లు, దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టే సంస్థలు షేర్ల విక్రయాలకు దిగడంతో పాటు.. మార్కెట్ ఒడిదుడుకుల నుంచి లాభాలు పొందేందుకు క్వాంటిటేటివ్ ట్రేడింగ్ సంస్థలు కూడా అమ్మకాలను పెంచాయి.

ఆసియా మార్కెట్లకూ అమ్మకాల సెగ

అమెరికాలో మొదలైన టెక్నాలజీ షేర్ల పతనం ఆసియా మార్కెట్లకూ విస్తరించింది. ముఖ్యంగా చిప్, సెమీకండక్టర్ కంపెనీల వాటా అధికంగా ఉన్న దేశాల మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దక్షిణ కొరియా కోస్పీ సూచీ 8 శాతానికి పైగా పడిపోవడంతో అక్కడ కొంతసేపు ట్రేడింగ్‌ను నిలిపివేశారు. తిరిగి లావాదేవీలు ప్రారంభమైన తర్వాత సూచీ కొంత కోలుకుంది. జపాన్ నిక్కీ సూచీ సుమారు 6 శాతం క్షీణించగా.. తైవాన్ ప్రధాన సూచీ కూడా 8 శాతానికి పైగా నష్టపోయింది. కంపెనీలవారీగా చూస్తే శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ షేరు దాదాపు 10 శాతం, ఎస్‌కే హైనిక్స్ షేరు సుమారు 12 శాతం పడిపోయాయి.

భారత్‌లో వారమంతా లాభాల జోరు

అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ.. భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆద్యంతం లాభాల్లోనే ముగిశాయి. నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు జరిగిన ఐదు ట్రేడింగ్ సెషన్లలోనూ సెన్సెక్స్, నిఫ్టీ పెరిగాయి. అంతకుముందు కొనసాగిన లాభాల పరంపరతో కలిపి దేశీయ సూచీలు వరుసగా ఏడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,718.01 పాయింట్లు (2.17 శాతం) పెరిగి 81,028.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 493.75 పాయింట్లు (2.01 శాతం) లాభపడి 25,030.35 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 27 తర్వాత నిఫ్టీ తొలిసారిగా 25 వేల పాయింట్ల స్థాయిని అధిగమించింది. వారంవారీగా చూస్తే సెన్సెక్స్ 6,568.49 పాయింట్లు, అంటే 8.82 శాతం పెరిగింది. నిఫ్టీ 1,977.25 పాయింట్లు, అంటే 8.58 శాతం లాభపడింది. గత ఆరేళ్లలో ఈ రెండు సూచీలకు ఇదే అతిపెద్ద వారపు పెరుగుదలగా నిలిచింది.

మదుపరుల సంపదకు రూ.28.7 లక్షల కోట్ల లాభం

దేశీయ మార్కెట్ల ర్యాలీతో మదుపరుల సంపద గణనీయంగా పెరిగింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ అక్టోబర్ 30న సుమారు రూ.474.37 లక్షల కోట్లుగా ఉండగా.. నవంబర్ 6 నాటికి రూ.503.07 లక్షల కోట్లకు చేరింది. అంటే ఈ ఒక్క వారంలోనే దాదాపు రూ.28.7 లక్షల కోట్ల సంపద పెరిగింది. మార్కెట్లు వరుసగా ఐదు రోజులు లాభాల్లో ముగియడం, ప్రధాన సూచీలు ఆరేళ్ల గరిష్ఠ వారపు ర్యాలీని నమోదు చేయడం ఈ పెరుగుదలకు దోహదపడింది.

విదేశీ పెట్టుబడుల ప్రవాహం.. ఇతర కారణాలు

దేశీయ మార్కెట్ల పెరుగుదలకు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు ప్రధాన మద్దతుగా నిలిచాయి. ఈ వారంలో ఎఫ్ఐఐలు నికరంగా సుమారు రూ.45,960 కోట్ల విలువైన భారతీయ షేర్లను కొనుగోలు చేశారు. గురువారం ఒక్కరోజే రూ.14,974.68 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు. దాదాపు ఆరేళ్లలో ఒకే రోజు నమోదైన అతిపెద్ద నికర కొనుగోళ్లలో ఇది ఒకటిగా నిలిచింది. వరుసగా విదేశీ పెట్టుబడులు రావడం దేశీయ మార్కెట్లపై మదుపరుల విశ్వాసాన్ని పెంచింది. ముడిచమురు ధరలు తగ్గడం, అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు దిగిరావడం, రూపాయి విలువ బలపడటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు తోడ్పడ్డాయి. అమెరికా ఎన్నికల అనంతరం వాణిజ్య, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గవచ్చనే అంచనాలు కూడా పెట్టుబడిదారుల నిర్ణయాలను ప్రభావితం చేశాయి. కంపెనీల రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేదా వాటిని మించి ఉండటం, ఈ ఏడాది ప్రారంభం నుంచి అమ్మకాల ఒత్తిడితో తగ్గిన పెద్ద కంపెనీల షేర్లు ఆకర్షణీయమైన ధరలకు లభించడం కొనుగోళ్లకు మరింత ఊతమిచ్చాయి.

బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల జోరు

శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో నిఫ్టీ-50లో ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధికంగా 4.75 శాతం లాభపడింది. మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్ కంపెనీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు కూడా గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. మరోవైపు ఎయిచర్ మోటార్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే కన్స్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ బ్యాంక్, ఫార్మా, ప్రైవేట్ బ్యాంకింగ్ సూచీలు లాభపడ్డాయి. ఇంధనం, మీడియా, రియల్టీ రంగాల సూచీలు నష్టాలను చవిచూశాయి. విస్తృత మార్కెట్లలో మిడ్‌క్యాప్ సూచీ స్వల్పంగా తగ్గగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.8 శాతం పడిపోయింది. దీంతో వరుసగా నాలుగు రోజులుగా కొనసాగిన స్మాల్‌క్యాప్ షేర్ల లాభాలకు బ్రేక్ వడింది. ఇదే సమయంలో దాదాపు 100 షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయిలను తాకాయి.

ఆరు నెలల గరిష్ఠానికి రూపాయి

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా ఈ వారం బలపడింది. శుక్రవారం ఒక్కరోజే 56 పైసలు పెరిగి 93.91 వద్ద ముగిసింది. గత ముగింపు 94.47తో పోలిస్తే ఇది ఆరు నెలల గరిష్ఠ స్థాయి. ముడిచమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి. రూపాయి విలువ పెరగడం వల్ల దిగుమతులపై ఆధారపడే రంగాలకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

ముహూరత్ ట్రేడింగ్‌పై దృష్టి

దీపావళి లక్ష్మీపూజ సందర్భంగా నవంబర్ 8, ఆదివారం ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ప్రకటించాయి. దీంతో వారాంతంలోనూ మదుపరులకు ప్రత్యేక ట్రేడింగ్ అవకాశం లభించనుంది. వరుస లాభాల అనంతరం దేశీయ మార్కెట్లు కీలక స్థాయిల వద్దకు చేరడంతో తదుపరి ట్రేడింగ్ సెషన్లలో సూచీల గమనం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ముడిచమురు ధరలు, అంతర్జాతీయ మార్కెట్ల పరిణామాలు కీలకం కానున్నాయి.

జిల్లాల మధ్య నీటి వివాదాలు సృష్టిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

అధికారంలో ఉన్నప్పుడు తొమ్మిది సర్వేలు చేసిన బీఆర్ఎస్.. డిండి ఎత్తిపోతలకు ఎక్కడి నుంచి నీళ్లు తీసుకోవాలో చెప్పలేకపోయిందని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఏడుల నుంచి డిండికి నీళ్లు తెస్తామని చెప్పి.. జిల్లాల మధ్య నీటి వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టును శనివారం సందర్శించిన కవిత.. ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డిండి ఎత్తిపోతలకు ఏడుల నుంచి నీరు తేవడం అంత సులువుకాదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఎల్లూరు పంపుహౌస్ కోసం చేపట్టిన బ్లాస్టింగ్‌తో కల్వకుర్తి పంపుహౌస్‌లో ఒక పంపు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుతం 0.6 టీఎంసీల కోసం మరో సొరు కోసం పంపుహౌస్ తవ్వితే కల్వకుర్తి, పాలమూరు పంపుహౌస్‌లకు ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ఇన్ని అడ్డంకుల మధ్య ఏడుల నుంచి డిండికి లింకు చేస్తామనడం, రెండు జిల్లాల ప్రజల మధ్య నీటి వివాదాలు సృష్టించడమేనని అన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ నీటితో బస్వాపూర్ మీదుగా డిండి ఎత్తిపోతలకు నీళ్లు ఇవ్వడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. లేదంటే బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి మీదుగా డిండికి నీటిని తరలించవచ్చని ప్రతిపాదించారు. మూడో ప్రతిపాదనగా మల్లన్న సాగర్ నుంచి కొండపోచంపల్లికి అక్కడి నుంచి శామీర్‌పేట చెరువు, శివన్నగూడెం నుంచి డిండి రిజర్వాయర్‌ను నింపవచ్చని సూచించారు. కృష్ణా జలాలను కాపాడుకునేందకు గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రయత్నించలేదని ఆరోపించారు. కాగా, ఎల్‌నినో నేపథ్యంలో ప్రతి ఎకరాకు రూ.25వేలు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు.

ఈ.వీ.ఎం. గోదాము ను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి

భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాల పరిశీలన



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 07(ప్రజా కలం):ఎన్నికల సంఘం ఆదేశానుసారం సాధారణ తనిఖీ లో భాగంగ ధరూర్ క్యాంప్‌లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) గోదామును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల భద్రత, గోదాము వద్ద చేపట్టిన రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాము పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతున్న తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చూడాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ జ్యోతి జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు అవకాశం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి - వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్





జగిత్యాల ప్రతినిధి నవంబర్ 7 (ప్రజా కలం):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు చెప్పారు. నవంబర్ 21 వరకు ఫారాలు సమర్పించవచ్చని వెల్లడించారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సర్ ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద్వ ఓటర్ల వివరాలపై సమీక్షించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఏడు రాష్ట్రాల్లో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందన్నారు. ఈ విషయంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఫారం-6 ద్వారా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ జాబితాల్లో పేర్లు ఉండి ఫారాలు సమర్పించని అర్హులు నవంబర్ 21లోగా సంబంధిత ఎన్నికల అధికారులకు ఫారాలు అందజేయాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటి విచారణ చేపట్టి అర్హులైన ఓటర్లను గుర్తించాలని, ఫారాలు అందని వారికి తిరిగి అందించాలని సూచించారు. ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ అనుసంధానమై ఉన్న ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫారాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

అలాగే ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటర్ల జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, పేర్లు తొలగించడానికి గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. ఈ వివరాలను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో సుమారు 77 వేల మంది ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటర్లను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.బీఎల్ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ) సమన్వయంతో ఆయా జాబితాల్లో ఉన్న ప్రతి ఓటరు ఇంటిని మరోసారి క్షేత్రస్థాయిలో సందర్శించి వివరాలను పరిశీలించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఫోన్, ఈ-మెయిల్ వివరాలు అనుసంధానమై ఉన్న ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలు పంపించాలని తెలిపారు. అదే సమయంలో ఒకే ఓటరు పేరు రెండుసార్లు నమోదు కాకుండా, ద్వంద్వ ఓటింగ్‌కు అవకాశం లేకుండా వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంబ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ




మెట్ పల్లి రూరల్,నవంబర్ 07:(ప్రజా కలం);

మెట్ పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జగన్ గౌడ్ చిన్నారులకు యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు ప్రతిరోజూ యూనిఫామ్ ధరించి రావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ హేమలత, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, లబ్ధిదారులు, ప్రీస్కూల్ చిన్నారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

సామవేదం పూర్వ భాగంలో ప్రతిభ..

షణ్ముఖ శర్మకు ఘన సన్మానం

రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రజిత పథకం అందుకున్న ఆత్మకూర్ యువకుడు



మెట్ పల్లి రూరల్,నవంబర్ 07:(ప్రజా కలం);మెట్ పల్లి మండలం ఆత్మకూర్ సామవేదం పూర్వ భాగం (మూలాంతం) విభాగంలో ఉత్తమ శ్రేణిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రజిత పథకం అందుకున్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన మునుగోటి షణ్ముఖ శర్మ (S/O రవిశర్మ)కు గ్రామ పంచాయతీ వద్ద ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు షణ్ముఖ శర్మను అభినందించారు. సామవేదంలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రజిత పథకం అందుకోవడం గ్రామానికి గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని షణ్ముఖ శర్మను ఘనంగా సత్కరించారు.

బెల్లంపల్లి లో కొత్త బస్టాండ్ లోపలికి బస్సులు రాక ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు: ఎంసీపీఐయు నాయకులు



బెల్లంపల్లి, నవంబర్7, (ప్రజాకలం) ప్రతినిధి.. మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి పట్టణంలోనీ కొత్తబస్టాండ్ ను శనివారం ఎంసిపిఐయు పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎం.సి.పి.ఐ.యు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లిలోని కొత్త బస్టాండ్ లో గుంత ఏర్పడిందని, గత మూడు నెలల నుండి బస్సులను లోపలికి వెళ్లకుండా ఆపారని బస్సులు లోపలికి వెళ్లకపోవడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు.బుంగ ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా కూడా ఆర్టీసీ డిపో మేనేజర్లు పట్టించుకోకపోవడం సరి కాదన్నారు. ప్రజలు విద్యార్థులు వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడుతున్న కూడా అధికార యంత్రాంగం చూసి చూడనట్టు వ్యవహరించటం చాలా బాధాకరమని సింగరేణి మైనింగ్ అధికారులు వచ్చి పర్యవేక్షించినప్పటికీ ఇంతవరకు బస్టాండ్ ను పట్టించుకోకపోవడం బెల్లంపల్లి ప్రజల పట్ల చిన్నచూపు చూడడమేనని భావిస్తున్నామని తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు మంచిర్యాల, ఆసిఫాబాద్, డిపో మేనేజర్లు,అలాగే మంచిర్యాల జిల్లా కలెక్టర్, సంబంధిత బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందించి బస్సులను బస్టాండ్ లోపలికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, శ్రీనివాస్ పాల్గొన్నారు..

బడుగుల గొంతుకగా పనిచేస్తా

- తెలంగాణ రక్షణ సేన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్

- ఉస్తేం శ్రీనివాస్ నియామకంపై సర్వత్రా హర్షం..ఘన సన్మానం



పెద్దపల్లి,నవంబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రక్షణ సేన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తేం శ్రీనివాస్ నియమితులయ్యారు.హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు.క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు వెనుకబడిన వర్గాల హక్కులు,సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా అధిష్ఠానం సూచించింది.జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తేం శ్రీనివాస్ నియామకం పట్ల ప్రగతి మృత్యు కార్మిక సేవ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ప్రగతి మృత్యు కార్మిక సేవ సమితి నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉస్తేం శ్రీనివాస్ ను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా నిరంతరం ప్రజాసేవ,జాతి అభ్యున్నతే ధ్యేయంగా ఉస్తేం శ్రీనివాస్ పనిచేస్తున్నానని గుర్తుచేశారు.ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ముదిరాజ్ జాతి బిడ్డల సమస్యల పరిష్కారం కోసం,మత్స్య కార్మిక సహకార సంఘాల హక్కుల కోసం నిరంతరం అండగా నిలబడడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్దపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు,ఇందుకు సహకరించిన పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటికి,రాష్ట్ర నాయకత్వానికి ఉస్తేం శ్రీనివాస్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.బడుగు,బలహీన వర్గాల గొంతుకై పనిచేస్తూ,సంస్థ సిద్ధాంతాలను ప్రతి పల్లెకూ తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.పెద్దమ్మ తల్లి ఆశయాల వారసులుగా ముదిరాజ్ జాతి అభివృద్ధి కోసం నాయకులంతా నిబద్ధతతో,విప్లవాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సన్మాన కార్యక్రమంలో ప్రగతి మృత్యు కార్మిక సేవ సమితి ముదిరాజ్ క్రమశిక్షణ పార్టీ చైర్మన్ కారుపాకాల రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు కలవేన రవి,ముదిరాజ్ జిల్లా నాయకుడు కలవేన శీనివాస్,మీడియా ఇంచార్జి కలవేన రాము,ముత్తారం మండలం అధ్యక్షులు ఎర్రం లక్ష్మయ్య,ఈర్ల సదయ్య,సబ్బు తిరుపతి,కారుపాకాల రాజేందర్,జునువాలా శ్రీనివాస్,శంకరి తోపాటు ముదిరాజ్ సంఘ ప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇంకుడు గుంతకు ముగ్గు పోసిన సర్పంచ్



ఎండపల్లి, నవంబర్ 07 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం రోజున పాఠశాల ఆవరణ లో నూతన ఇంకుడు గుంతకు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ముగ్గు పోయడం జరిగింది. అనంతరం పాఠశాల లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని తనిఖీ చేయగా 134 మంది విద్యార్థులు హాజరుకాగా కూరలు పప్పు నీళ్ళ వల్లే ఉన్నాయని అరకి లో బెండకాయల తో కూరలు వండితే విద్యార్థుల కు కూరలు ఎలా చరిపో తాయని గ్రామ సర్పంచ్ మండిపడ్డారు. ఇలా కూరలు వండితే ఎలా అని వంటల్లో కూరల నాణ్యత సరిగా లేదని వంట మనిషిని అడుగగా ఈరోజు స్కూలు ఉంటుందొ లేదో అని కూరగాయలు తేలేదని వంట మనిషి తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి జె కొమురయ్య, కరోబార్ రామగిరి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పొన్నం రాజు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి ప్రమాణ స్వీకారం

ప్రెస్ క్లబ్ తరఫున శాలువాతో సత్కరించి అభినందించిన పాత్రికేయులు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, నవంబర్ 7(ప్రజా కలం): తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు.శనివారం హైదరాబాద్‌లోని మైత్రీవనంలో మంత్రుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం హకీంపేటలోని కన్వెన్షన్ హాల్‌లో జువ్వాడి నర్సింగరావు గౌరవార్థం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పాత్రికేయులు,ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వెలమ సంఘం ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నర్సింగరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్ తో పాటు పాత్రికేయులు గోడికే రాజు, సాల్వాజీ రాజా రమేశ్, సాజిద్ ఆలీ, గజం శంకర్, చెట్పల్లి లక్ష్మణ్, ఇందూరి నరేష్, పిన్నంశెట్టి శ్రీధర్, జవ్వాజి గంగాధర్ తదితరులు జువ్వాడి నర్సింగరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రెస్ క్లబ్ తరఫున నర్సింగరావుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో వెలమ కార్పొరేషన్‌కు తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన పదవీకాలంలో కార్పొరేషన్ మరింత అభివృద్ధి చెందడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన భోజేందర్ రెడ్డి



గొల్లపల్లి నవంబర్ 07 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి చెందిన జక్కుల రామేశ్వరి,చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శంకరావుపేట గ్రామానికి చెందిన సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుల కుటుంబ సభ్యులకు ఇద్దరికి చెరో 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించి బరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో చిల్వకోడూర్ సర్పంచ్ దాసరి తిరుపతి,మాజీ సర్పంచ్ అలిశెట్టి రవీందర్, యూత్ నాయకులు ఆవారి చందు,బూసరపు సిద్ధూ,మొగిలి,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

ఐపీఎస్ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు : సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి



సుల్తానాబాద్,నవంబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది,దీపాలను వెలిగించి దీపావళి సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.విద్యార్థుల సందడితో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్,ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హాజరై విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని,భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు.ఇటువంటి వండుగల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి,సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు.ఈ వేడుకల్లో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత ఉపాధ్యాయినులు,విద్యార్థినీలు పాల్గొన్నారు.

ప్రజా కలం
ఆదివారం, నవంబర్ 8, 2026

ఆన్‌లైన్ విస్తరణతో చిన్న దుకాణాల
మనుగడకు సవాళ్లు

వది నిమిషాల్లో ఇంటి ముంగిటకు వస్తువులు చేరుతున్నాయి. వినియోగదారులకు సమయం ఆదా అవుతోంది. సాంకేతికత అందిస్తున్న ఈ సౌలభ్యం వెనుక మరో ఆర్థిక వాస్తవం నిశ్శబ్దంగా రూపుదిద్దుకుంటోంది. దశాబ్దాలుగా భారతీయ కుటుంబాల అవసరాలు తీర్చిన చిన్న కిరాణా దుకాణాలు తమ ఉనికిని కాపాడుకునేందుకు పోరాడుతున్నాయి. ఆన్‌లైన్ వ్యాపార విస్తరణ కేవలం కొనుగోలు విధానాన్నే కాకుండా లక్షలాది కుటుంబాల జీవనోపాధిని ప్రభావితం చేస్తోంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ 2026 జూన్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం దేశంలో సుమారు 1.4 కోట్ల కిరాణా దుకాణాలున్నాయి. నిత్యావసర వినియోగ వస్తువుల విక్రయాల్లో సంప్రదాయ రిటైల్ వ్యవస్థ వాటా 75 నుంచి 80 శాతం వరకు ఉంది. మరోవైపు మార్కెట్ పరిశోధన సంస్థ డాటమ్ ఇంటెలిజెన్స్ అంచనాల ప్రకారం 2026 ఆగస్టులో దేశంలోని ప్రముఖ వేగవంతమైన డెలివరీ సంస్థల ద్వారా రోజుకు దాదాపు 95 లక్షల ఆర్డర్లు నమోదయ్యాయి. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి సంస్థల విస్తరణ వినియోగదారుల కొనుగోలు అలవాట్లలో వస్తున్న మార్పుకు నిదర్శనం. సంప్రదాయ కిరాణా దుకాణం కేవలం వ్యాపార కేంద్రం కాదు. స్థానిక కుటుంబాలతో దశాబ్దాలుగా కొనసాగుతున్న నమ్మకానికి ప్రతీక. నెలవారీ అరువు సౌకర్యం, అత్యవసర సమయాల్లో సహాయం, వ్యక్తిగత పరిచయాలు చిన్న వ్యాపారాల ప్రత్యేకత. ఆన్‌లైన్ సంస్థల భారీ రాయితీలు, వేగవంతమైన సరఫరాతో పోటీపడేందుకు పరిమిత పెట్టుబడులతో పనిచేసే దుకాణదారులకు అవకాశాలు తక్కువ. ఈ మార్పులో మరో ముఖ్యమైన అంశం ఉపాధి స్వరూపం. చిన్న దుకాణాలు యజమానులతోపాటు సహాయకులకు, స్థానిక సరఫరాదారులకు జీవనోపాధి కల్పిస్తాయి. డిజిటల్ వ్యాపారాలు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తున్నప్పటికీ డెలివరీ సిబ్బంది ఆదాయ భద్రత, బీమా, సామాజిక రక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. అయితే సాంకేతిక అభివృద్ధిని వ్యతిరేకించడం పరిష్కారం కాదు. చిన్న వ్యాపారులను కూడా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయాలి. వాట్సాప్ ఆర్డర్లు, డిజిటల్ చెల్లింపులు, ఓఎన్‌డీసీ వంటి వేదికల ద్వారా స్థానిక దుకాణాలకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించవచ్చు. ఆధునిక నిల్వల నిర్వహణ, తక్కువ వడ్డీ రుణాలు, సాంకేతిక శిక్షణ వారికి ఉపయోగపడతాయి. అదేవిధంగా భారీ సంస్థల ధరల విధానాల్లో పారదర్శకత, సమాన పోటీ అవకాశాలు, వినియోగదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న వ్యాపారులు, డిజిటల్ సంస్థల మధ్య భాగస్వామ్య నమూనాలను ప్రోత్సహించాలి. వినియోగదారులకు సౌలభ్యం పెరగడంతోపాటు చిన్న వ్యాపారులకు అవకాశాలు విస్తరించినప్పుడే నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యమవుతుంది. సాంకేతిక విప్లవం సంప్రదాయ జీవనోపాధులను నిర్వీర్యం చేయకుండా వాటిని మరింత బలోపేతం చేసే దిశగా సాగాలి.

(హెచ్. ప్రతాప్)

అత్త మృతి కేసులో వీడిన మిస్టరీ.. కోడలి అరెస్ట్

ధర్మారం,నవంబర్ 07 (ప్రజా కలం ప్రతినిధి)

అత్త ఆత్మహత్యకు కారణమైన కోడలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.మండల కేంద్రానికి చెందిన గంగాధర లక్ష్మి గత నెల 10న అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా,సింగిరెడ్డి సరోజన ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.విచారణలో కోడలు గంగాధర పుష్పలత నిత్యం వేధింపులకు పాల్పడుతుండడంతో భరించలేకే లక్ష్మి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నట్లు వెల్లడైంది. అయితే ఈ నింద తమపై పడకుండా ఉండేందుకు పుష్పలత, ఆమె భర్త వెంకటేష్ కలిసి అనారోగ్యంతోనే చనిపోయినట్లు కట్టుకథ అల్లినట్లు పోలీసులు గుర్తించారు.పోలీసుల విచారణలో పుష్పలత తన నేరాన్ని అంగీకరించడంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

నేడు ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం
లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుభాకాంక్షలు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 07:

దీపావళి పండగను పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా



నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల కుటుంబాలకు, జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గారు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 3,845 కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. రేపు జరుపుకోబోయే దీపావళి పండగ సందర్భంగా “మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి” పేరిట ఈ లబ్ధిదారుల ఇళ్లలో కొత్త వెలుగులు నిండబోతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. నూతన గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబాల జీవితాల్లో ఈ దీపావళి కాంతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని నింపాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారంలో
సర్కారు నిర్లక్ష్యం తగదు

- ఎన్‌హెచ్ఎం సిబ్బంది న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు
- బీజేపీ రాష్ట్ర నాయకుడు దుగ్యాల ప్రదీప్ కుమార్



పెద్దపల్లి,నవంబర్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్,పొరుగు సేవల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు దుగ్యాల ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి,తమ సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా దుగ్యాల ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పల్లెలు మొదలుకుని పట్టణాల వరకు ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శించడం శోచనీయమన్నారు.అరకొర వేతనాలతో వెట్టిచాకిరీ చేయిస్తూ, వారి భవితవ్యాన్ని గాలికొదిలేయడం తగదని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు,ఉద్యోగ భద్రత కల్పించాలని,దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న న్యాయమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి రోడ్డెక్కే దుస్థితిని తీసుకురావడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జేఏసీ నాయకులతో తక్షణమే చర్చలు జరపాలని,సమ్మె విరమణకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలు కొలిక్కివచ్చేంత వరకు వారి పక్షాన నిలబడి పోరాడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు రాకేష్,మండల అధ్యక్షులు వేల్పుల రమేష్,కారంగుల శ్రీనివాస్,సీనియర్ నాయకులు గుడిపాటి సంతోష్,ఈర్ల శంకర్,రామన్న,చాతరాజుల రమేష్,ఆది సతీష్,చిలక తిరుపతి, మామిడి ఉమేష్,గుడ్ల సతీష్,గాదాసి సతీష్,కలవేన శ్రీనివాస్,ఎన్‌హెచ్ఎం జేఏసీ నాయకులు,వైద్య సిబ్బంది,ఇతర ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లింలకు ఆత్మబంధువు వ్యాల్ల హరీష్ రెడ్డి
-దివ్యాంగుడి కుమార్తె వివాహానికి 10వేల ఆర్థిక సాయం



పెద్దపల్లి,నవంబర్ 07:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిరుపేద ముస్లిం కుటుంబానికి అండగా నిలుస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అడ్డగుంటపల్లి స్వతంత్ర చౌక్‌కు చెందిన దివ్యాంగుడు,నిరుపేద సర్వర్ పాషా కుమార్తె సుభాని వివాహం సందర్భంగా హరీష్ రెడ్డి ఆదేశాల మేరకు రామగుండం కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు తస్నిమ్ భాను చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తస్నిమ్ భాను మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన షాదీ ముబారక్ పథకం నిలిచిపోయినప్పటికీ, నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే వ్యాల్ల హరీష్ రెడ్డి ఈ సహాయాన్ని అందించారని తెలిపారు.ఏటా రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని దాదాపు 600 మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తూ మైనార్టీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న హరీష్ రెడ్డి ముస్లిం సమాజానికి ఆత్మబంధువుగా మారారని కొనియాడారు.పేద కుటుంబాల కష్టాల్లో భాగస్వామ్యమవుతూ ఆదుకోవడం అభినందనీయమన్నారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హరీష్ రెడ్డిని స్థానికులు, ముస్లిం పెద్దలు అభినందించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి జహీద్ పాషా,మైనార్టీ నాయకులు హసేన్ చిస్తీ,జాఫర్,రాజ్ మహమ్మద్,మున్వార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మండల ఫోటో,వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్
సభ్యులను కలిసిన రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్.....



బెల్లంపల్లి, నవంబర్ 7, (ప్రజాకలం)ప్రతినిధి..

తెలంగాణ రాష్ట్ర ఫోటోడ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.కె హుస్సేన్ బెల్లంపల్లి లో పర్యటించారు. బెల్లంపల్లి మండల్ ఫోటో,వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా అయిన ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులకు యూనియన్ అభివృద్ధి కోసం,ప్రస్తుతం రాష్ట్రంలో ఏ ఫోటోగ్రాఫర్ చనిపోయిన యూనియన్ తరపున వారికి రెండు నుంచి నాలుగు లక్షల రూపాయలు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని గుర్తు చేశారు.భవిష్యత్తులో యూనియన్,ఫోటోగ్రాఫర్స్ మనుగడ ,అభివృద్ధి కోసం తీసుకునే నిర్ణయాలను సభ్యులకు తెలిపారు.అదేవిధంగా (ఏ.ఐ)టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకోవాలో తెలిపారు.యూనియన్ అభివృద్ధి కోసం సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే హుస్సేన్,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కనుకయ్య గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్వాస తిరుపతి,జిల్లా కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న సుధాకర్, కుటుంబ భరోసా ఇంచార్జ్ నూనె సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకునూరి రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి రుకుం ప్రసాద్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఆకుల వేణు,బెల్లంపల్లి మండల ప్రధాన కార్యదర్శి గజెల్లి రఘు,మందమరి అసోసియేషన్ కోశాధికారి బద్రి సతీష్, రొమాంటిక్ స్టూడియో సాయి, బెల్లంపల్లి యూనియన్ సభ్యులు ఫోకస్ ప్రేమ్,దుండ్ర మహేందర్,చిన్నా ,మల్టీ వెంకటేష్ ,త్రివి మోహన్, వెంకటేష్, నరేష్,రాము,సిద్దు, సాగర్,శివ ప్రసాద్,రమేష్, చక్రధర్,రాజు,ప్రశాంత్,ప్రదీప్, సంజీవ్,యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అఖిలభారత 36వ రైతు
మహాసభలను జయప్రదం చేయాలి

- రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి - యాదిరెడ్డిపల్లిలో రైతు మహాసభల కరపత్రాల విడుదల



తాడూరు, నవంబర్ 07 (ప్రజాకలం) :ఏఐకేఎస్ (అఖిల భారత రైతు సంఘం) అఖిలభారత 36వ రైతు మహాసభలను ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జయప్రదం చేయాలని కేవీపీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామంలో పంట పొలాల వద్దకు వెళ్లి రైతులను కలిసి రైతు మహాసభల ప్రాముఖ్యతను వివరించారు. రైతుల సమస్యలు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రైతాంగ హక్కుల సాధన కోసం అఖిల భారత రైతు సంఘం చేపడుతున్న పోరాటాల గురించి వివరించి కరపత్రాలను విడుదల చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ రైతుల ఐక్యతతోనే వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న పంట నష్టాలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, సాగునీటి సమస్యలు, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత వంటి సమస్యలపై రైతులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.రైతాంగ హక్కుల పరిరక్షణ, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఏఐకేఎస్ అఖిలభారత 36వ రైతు మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్పోతుల కాశన్న, మోహన్ గౌడ్, శంకర్, రాములు, మహిళలు రావులమ్మ, చిన్నమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాన్యం కుప్పల పై.. వానర దండు బీభత్సం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



గొల్లపల్లి నవంబర్ 07ప్రజా కలం, ప్రతినిధి :

గొల్లపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో దాన్యం (వరి)కోతలు ప్రారంభం అయ్యాయి.రైతులు వారు పండించిన పంటలకు సరియైన తేమ శాతం వచ్చేందుకోసం దాన్యం కొనుగోలు కేంద్రాలు, రోడ్ల పై ఆరబోస్తుండగా వానరులు (కోతులు) గుంపు, గుంపు లుగా సంచారిస్తూ వడ్ల కుప్పల పై దాడి చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆరుగాల కష్టపడి పండించిన ధాన్యం వానరుల చేస్తున్న దాడిలో నష్టపోకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. పంట చేతికొచ్చి ధాన్యాన్ని కుప్పలుగా పోసుకున్న రైతులకు కోతుల బెడద తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కోతుల గుంపులు వడ్ల కుప్పలపై దాడి చేస్తూ ధాన్యాన్ని చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటను కోతుల బారినుండి కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కోతుల గుంపులు ఒక్కసారిగా వచ్చి వడ్ల కుప్పలపై తిరుగుతూ ధాన్యాన్ని చిందరవందరశీ చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ కోతుల బెడద మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతుల బెడద నుంచి రైతులకు రక్షణ కల్పించే విదంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు

రోడ్డు ప్రమాదంలో బైకును ఢీ కొన్న టిప్పర్ మహిళా మృతి



ఎండపల్లి, నవంబర్ 07 : (ప్రజాకలం ప్రతినిధి) మండలంలోని మారేడుపల్లి గ్రామ శివారు లో శనివారం రోజున రోడ్డు ప్రమాదం బైకును ఢీకొన్న టిప్పర్ మహిళ మృతి ప్రమాదం లో తీవ్రంగా గాయపడ్డ ఆవుల ప్రణీత భర్త కృష్ణను హసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్య లో మహిళ మృతి భర్త కృష్ణకు తీవ్ర గాయాలు కాగా హసుపత్రి లో చికిత్స పొందుతున్నట్లు దీపావళి పండుగకు స్వగ్రామం వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. మృతురాలు బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆవుల ప్రణీత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు గ్రామం లో విషాదచాయలు అలము కున్నాయి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓటర్ల జాబితా సవరణపై
అపోహలు వీడాలి


-బీజేపీ రాష్ట్ర నాయకుడు దుగ్యాల ప్రదీప్ కుమార్



పెద్దపల్లి,నవంబర్ 07:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విధానంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని,అపోహలను ప్రజలు నమ్మవద్దని బీజేపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి,పెద్దపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ దుగ్యాల ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు.శనివారం పెద్దపల్లి స్థానిక సిరి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి అధ్యక్షతన ఎస్ఐఆర్ ప్రక్రియ మీద మేధావుల సంగోష్ఠి కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ద్వారా రాజ్యాంగ విరుద్ధంగా దేశంలో దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించారని ప్రతిపక్షాలు,కొందరు విమర్శకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని,నిరాధారమైనవని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం పారదర్శకంగా జరిగే చట్టబద్ధమైన నిరంతర ప్రక్రియ అని వివరించారు.ఒకే వ్యక్తికి రెండు నియోజకవర్గాల్లో లేదా రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండటం చట్టవిరుద్ధమని, కేవలం సాంకేతికత మరియు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా మాత్రమే అటువంటి డూప్లికేట్ ఓట్లను ఏరివేస్తున్నారని తెలిపారు.ఏ ఒక్క పౌరుడి ఓటునూ నేరుగా లేదా ఏకపక్షంగా తొలగించరని,ఫారం-7 ద్వారా భౌతిక విచారణ జరిపి,ముందస్తు సమాచారం,నోటీసులు ఇచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.ఒకవేళ పొరపాటున ఎవరి ఓటైనా తొలగించబడినా,ఫారం-6 ద్వారా కొత్త ఓటు కోసం లేదా పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు.ఈ వాస్తవాలను సమాజంలోని ప్రతి ఒక్కరికీ వివరించి ప్రజల్లోని అపోహలను నివృత్తి చేయాలని సదస్సుకు హాజరైన మేధావులను ఆయన కోరారు.రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్లు,టీచర్లు,అడ్వకేట్లు,ఎన్జీవోల ప్రతినిధులు,వివిధ కులసంఘాల నాయకులు,మేధావులు విస్తృతంగా పాల్గొని చర్చించారు.ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు పల్లె సదానందం,కడారి అశోక్ రావు,సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, శిలారపు పర్వతాలు,పోల్సాని సంపత్ రావు,కావేటి రాజగోపాల్,గుడిపాటి సంతోష్ రెడ్డి,ఈర్ల శంకర్,జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్,పట్టణ అధ్యక్షులు పెండ్ర రాకేష్,యువమోర్చా జిల్లా అధ్యక్షులు రామగిరి అఖిల్,న్యాయవాదులు దాడి సంతోష్,క్రాంతి సింగ్ ఠాగూర్,సోన్నాయి వెంకం అశోక్,గుడ్ల వెంకటేష్,డాక్టర్ అశోక్,వివిధ మండలాల అధ్యక్షులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబుపై విమర్శలు చేస్తే సహించేది లేదు

- ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంత్రి రాజసమ్మయ్య



మల్హర్ నవంబర్ 07 ప్రజాకలం ప్రతినిధి : ఇటీవల గణపతి సచ్చిదానంద స్వామీజీ కాటారం పర్యటనకు విచ్చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న నేపథ్యంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ లేఖ పై శనివారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మల్హర్ రావు మండల అధ్యక్షులు మంత్రి రాజసమ్మయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును విమర్శించే స్థాయి ఎంపీకి లేదన్నారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ గెలుపుతో పాటు, ఆయన తండ్రి, తాతల రాజకీయ విజయాల్లోనూ శ్రీధర్‌బాబు కుటుంబం ఎన్నోసార్లు కృషి చేసిన విషయాన్ని మరిచిపోవద్దని అన్నారు. శ్రీధర్‌బాబుపై అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదని ఎంపీని హెచ్చరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని పేర్కొన్నారు.

మరిపెడ రామవిలాస్ బజారులో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో జామున జ్యువెలరీ వర్క్‌షాప్‌లో చెలరేగిన మంటలు



మరిపెడ, ప్రజా కలం న్యూస్ నవంబర్ 7:

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని రామవిలాస్ బజారులో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బజారులో ఉన్న జామున జ్యువెలరీ వర్క్‌షాప్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. వర్క్‌షాప్ నుంచి మంటలు, పొగలు రావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. వ్యాపార ప్రాంతంలో అగ్నిప్రమాదం జరగడంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఆస్తి నష్టం, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అగ్నిప్రమాదంతో రామవిలాస్ బజారులో కొద్దిసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది.

బీసీలకు అన్ని రంగాలలో న్యాయం చేకూర్చాలి

- వి బి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్

వాజేడు నవంబర్ 07 (ప్రజా కలం) బీసీ సంఘాల ఆత్మగౌరవ భవనాలకు 88.50 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలియజేసిన



వాడ బలిజ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆత్మగౌరవ భవనాలతో పాటు బీసీలకు విద్య ఉద్యోగ అవకాశాలు మరియు రాజకీయ రంగంలో బీసీలకు అవకాశాలు కల్పిస్తూ బీసీలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు.బీసీ కార్పొరేషన్ ద్వారా 90% సబ్సిడీ రుణాలు మంజూరు చేసి తెలంగాణ రాష్ట్రంలో వెనకబడి ఉన్నటువంటి బీసీ కులాలను అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నందున బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు .

చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ



(వరంగల్/ పర్వతగిరి) నవంబర్ 07, ప్రజాకలం ప్రతినిధి. విద్యార్థులలో చిన్ననాటి నుండి ప్రశ్నించే తత్వం, హేతుబద్ధ ఆలోచన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జడ్పిహెచ్ఎస్ పర్వతగిరి ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నాలుగు దశలుగా నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి ఆటంకంగా ఉన్న మూడు నమ్మకాలను తొలగించడంలో జన విజ్ఞాన వేదిక నిబద్ధతతో పనిచేస్తుందని గత 38 సంవత్సరాలుగా విద్యార్థులకు, సమాజానికి సేవనందిస్తుందని తెలియజేశారు. నేటి విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ, పరిశోధిస్తూ, ఆధారాలతో ఆలోచించి పరిశీలన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, సామాజిక చైతన్యాన్ని పెంపొందింప చేసుకోని భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. మండల కన్వీనర్ బైరి తిరుపతి మాట్లాడుతూ.. సైన్స్ ను పుస్తకాలకే పరిమితం చేయకుండా ప్రయోగాలు పరిశీలనలు సృజనాత్మకత కార్యకలాపాల ద్వారా నేర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక ఆవిష్కరణలను కనుగొని కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాలని కోరారు. విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలి పరిశీలనా పరిశోధన ప్రయోగాత్మక అనుభవంతో ప్రతిదీ శాస్త్రీయ దృక్పథాన్ని, శాస్త్రీయా వైఖరిని పెంపొందింప చేసుకోవాలని కోరారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 12 వ తారీఖున చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉంటుందని 8 9 10 చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొని పరీక్షలు విజయవంతం చేయాలని కోరారు. అందుకు ప్రిన్సిపల్ హెడ్మాస్టర్లు సహకరించాలని కోరారు. పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నవంబర్ 12వ తారీఖున ఉంటుందని, మండల స్థాయి నవంబర్ 21వ తారీఖున పరీక్ష ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం నవీన్ కుమార్ పాఠశాల సీనియర్ సైన్సు ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు, మండల కన్వీనర్ బైరి తిరుపతి, మనోహర్, శ్రీధర్, అశోక్, ప్రతిభ, రవికుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

నాగర్‌కర్నూల్‌లో ఘనంగా జిల్లా స్థాయి పద్య పఠన పోటీలు

గుర్రం జాషువా ఫౌండేషన్ క్లాస్మేట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీ నిర్వహణ

20 పాఠశాలల నుంచి 90 మంది విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన



నాగర్‌కర్నూల్, నవంబర్ 07 (ప్రజాకలం) :మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్‌లో జిల్లా స్థాయి పద్య పఠన పోటీలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా ఫోరం, గుర్రం జాషువా ఫౌండేషన్, క్లాస్మేట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 365 రోజులు – 365 కార్యక్రమాల్లో భాగంగా 311వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు జాషువా, వేమన, సుమతీ శతకం తదితర కవుల పద్యాలను భావయుక్తంగా ఆలపించి తమ ప్రతిభను చాటుకున్నారు.విద్యార్థుల పద్య పఠనంలో ఉచ్చారణ, భావవ్యక్తీకరణ, స్పష్టత, ప్రదర్శన నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకొని న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేయగా, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ మెడల్స్, పెన్నులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, జీసీడీఓ నిర్మల, డీఎస్ఓ శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే తెలుగు భాషపై మక్కువ, సాహిత్యంపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పద్య పఠనం ద్వారా భాషా నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, భావవ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతాయని పేర్కొన్నారు. తెలుగు పద్య సాహిత్యం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, భావితరాలకు గొప్ప కవుల సాహిత్య సంపదను పరిచయం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

పెన్షన్, జీపీఎఫ్ పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 13న అదాలత్-కమ్- వర్క్‌షాప్ నిర్వహణ

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

పెన్షనర్లు, ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం

సంబంధిత శాఖల అధికారులు, డీడీఓలు అవసరమైన రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలి

ఖమ్మం, నవంబర్ 07(ప్రజా కలం న్యూస్)

పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్), అకౌంట్స్ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన (శుక్రవారం) కలెక్టరేట్ (ఐడీఓసీ)లో పెన్షన్-జీపీఎఫ్ అదాలత్- కమ్-వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు ప్రారంభ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసుల పరిష్కారం, పెన్షనర్ల సమస్యల పరిశీలన, ఉద్యోగులకు పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో సమర్పించే విధానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఏసీ బిల్లులు, పెండింగ్ వోచర్లు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలు, చెల్లించిన చెక్కులకు సంబంధించిన వివరాలు, జీపీఎఫ్ పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), జిల్లా ట్రెజరీ అధికారులు, సబ్ ట్రెజరీ అధికారులు తమ సంబంధిత సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.పెండింగ్‌లో ఉన్న పెన్షన్ ఫైళ్లు, సర్వీస్ బుక్కులు, జీపీఎఫ్ తుది చెల్లింపు దరఖాస్తులు,



సమర్పించాల్సిన వోచర్లు, పెండింగ్ ఏసీ బిల్లుల క్లియరెన్స్ వివరాలు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలకు సంబంధించిన అనుసరణ నివేదికలు తదితర అవసరమైన రికార్డులన్నింటినీ వెంట తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. తద్వారా సాధ్యమైనంత వరకు సమస్యలను కార్యక్రమంలోనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్హులైన పెన్షనర్లకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు (పీపీఓలు), జీపీఎఫ్ చందాదారులకు జీపీఎఫ్ ఆథరైజేషన్ లేఖలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పెన్షనర్లకు, ఉద్యోగులకు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని, స్థానిక పెన్షనర్ల సంఘాలకు సమాచారం అందించి, సమస్యలు ఉన్న పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

రైతు మేళాకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 2,500 మంది రైతులు

50 ప్రత్యేక బస్సుల ఏర్పాటు.. ప్రతి బస్సుకు నోడల్ అధికారితో పాటు పోలీసు సిబ్బంది, మహిళా సంఘం సభ్యురాలు



నాగర్‌కర్నూల్ నవంబర్ 07 (ప్రజా కలం): రైతుల అభ్యున్నతి, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రైతు మేళా నిర్వహించనున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ మేళా జరగనుంది. నవంబర్ 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు మేళాను ప్రారంభించనున్నారు.తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడులు సాధించడం, సాగు ఖర్చులను తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రధాన లక్ష్యంగా ఈ మేళాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

జిల్లా నుంచి 2,500 మంది రైతుల ఎంపికనాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి రైతు మేళాకు 2,500 మంది రైతులను ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. నవంబర్ 9న జిల్లాకు చెందిన రైతులు హకీంపేటలో జరిగే రైతు మేళాకు తరలివెళ్లనున్నారు. రైతుల రవాణా సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఒక్కో బస్సులో 50 మంది రైతులు ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రతి బస్సుకు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని నోడల్ అధికారిగా నియమించారు. రైతుల భద్రత కోసం పోలీసు అధికారిని, సహాయకారిగా మహిళా సంఘం సభ్యురాలిని కూడా ఏర్పాటు చేశారు. ప్రయాణ సమయంలో రైతులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాలు కల్పించనున్నారు.

ఆధునిక సాగు విధానాలపై అవగాహన

రైతు మేళాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించనున్నారు. నీటి యాజమాన్యం, భూసార పరిరక్షణ, మట్టి పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణ, అధిక దిగుబడులిచ్చే పంటల ఎంపిక, పంటల ఉత్పాదకత పెంపు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. రైతు మేళాలో తెలుసుకున్న నూతన సాగు విధానాలను తమ వ్యవసాయ క్షేత్రాల్లో అమలు చేయాలని, అక్కడ పొందిన విజ్ఞానాన్ని గ్రామాల్లోని ఇతర రైతులకు కూడా వివరించాలని కోరారు. రైతుల ఆదాయాభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతానికి జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లాను వ్యవసాయ రంగంలో ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌కు సన్మానం



తానూ ర్ , నవంబర్ 07(ప్రజా కలం): ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆశమొల్ల మోహన్‌కు బైంసాలో ఘనంగా సన్మానం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు ఆర్ఎంపీ వైద్యులు, సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్ నాయకత్వంలో ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి జరగాలని ఆకాంక్షించారు. ఆర్ఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందించి, తగిన గుర్తింపు కల్పించేలా కృషి చేయాలని కోరారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు, సభ్యులకు ఆశమొల్ల మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంపీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గుండెపూడి గ్రామ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

- సుఖసంతోషాలతో వర్ధిల్లాలి ఉపసర్పంచ్ గడ్డం ఉప్పిరెడ్డి

ప్రజాకలం న్యూస్ మరిపెడ, నవంబర్ 7 దీపావళి పండుగను పురస్కరించుకొని



గుండెపూడి గ్రామ ప్రజలకు గ్రామ ఉపసర్పంచ్ ఉప్పిరెడ్డి హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరిలో నరికొత్త ఆశలు, ఆనందాన్ని నింపుతుందని పేర్కొన్నారు గ్రామ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, గ్రామంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారం మరింత బలపడాలని కోరుకున్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని కాలుష్య రహితంగా, జాగ్రత్తలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని సూచించారు గ్రామభివృద్ధిలో ముందడుగు వేస్తానని నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చిన గ్రామస్తులు అందరికీ రుణపడి ఉంటాను అన్నారు. ప్రజలందరికీ మరోసారి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారూ

కంజర్ గ్రామస్తుల భూముల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

- మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) లక్ష్మణచందా మండలం కంజర్ గ్రామ భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కంజర్ గ్రామస్తుల భూముల సమస్యల పరిష్కార విషయంపై లక్ష్మణచందా తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ సమస్యల దరఖాస్తుల సంఖ్య, సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి వివరాలు క్లుప్తంగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తుల వివరాలన్నీ పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు.

మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి: మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి వచ్చే దరఖాస్తులన్నీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అవసరమైతే దరఖాస్తులను పై స్థాయికి పంపాలని తెలిపారు. మండలంలో భూముల రీ సర్వే ప్రక్రియను సమీక్షించారు.భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకట మాధవ రావు, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్ సరిత, ఎంపిడివో వనజ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోషఫ్ ని

పరామర్శించిన తుమ్మలపల్లి రమేష్

తల్లాడ. నవంబర్ 7 ప్రజా కలం న్యూస్ అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోషఫ్ ప్రమాదవశాత్తు కాలు జరిపడి కుడి కాలు కి సర్జరీ జరిగిన అనంతరం డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాడు ఈ సందర్భంగా అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ జోసఫ్ ను ఇంటికి వెళ్లి పరామర్శించాడులిఈ కార్యక్రమంలో భవాని, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో ఉన్న కుటుంబానికి లింగారంతండ యువత ఆర్థిక చేయూత

మానవత్వానికి నిదర్శనంగా ఆపన్నహస్తం కార్యక్రమం

ఐక్యతతో అండగా నిలిచిన యువత



పాలేరు నవంబర్ 07(ప్రజా కలం న్యూస్) లింగారంతండా గ్రామంలోని ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ లింగారంతండా యువత మరోసారి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. లింగారంతండాకు చెందిన అజయ్ కుటుంబం కష్టాల్లో ఉన్న విషయం తెలుసుకున్న యువత, ఆపన్నహస్తం కార్యక్రమం ద్వారా తమ వంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ. సమాజంలో ఎవరికి కష్టం వచ్చినా ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించాలని, ఆపద సమయంలో ఒకరికొకరు తోడుగా నిలవాలని అన్నారు. మనమంతా ఐక్యంగా ఉంటూ పేద, నిరుపేద కుటుంబాలకు చేతనైన సహాయం అందించడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.

ఈ మంచి కార్యక్రమానికి సహకరించి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆపదలో ఉన్నవారికి తమ ఆపన్నహస్తం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషన్, బాలకృష్ణ, భరత్ కుమార్, రెడ్యా నాయక్, జవహర్‌లాల్, నాగేశ్వరరావు, పాపారావు, నాగులు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రమేష్, భాస్కర్, శంకర్ నాయక్, రవీజీ, మాను, జగపతి, వెంకటేష్, కిషన్ బానోతు, వీరబాబు, ఉపేందర్, ధర్మ నాయక్, నాగేష్ వాడిత్యతో పాటు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు తుపాను వల్ల పంటలు కోల్పోయిన రైతన్నలను

ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



ఖమ్మం నవంబర్ 07(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు ఉమ్మడి జిల్లాకు చేసిన మేలేమిటో,ఒరగబెట్టిందేమిటో వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక,తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ,పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ,విపత్తుల నివారణ శాఖల మంత్రులుగా ఉండి ఉమ్మడి జిల్లా అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం కూడా పట్టించుకోవడం లేదన్నారు.ఎంపీ రవిచంద్ర శనివారం ఖమ్మం తెలంగాణ భవన్ లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య,జేడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, పార్టీ నాయకులు బమ్మెర రాంమూర్తి, బెల్లం వేణు, సుబ్బారావు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ప్రతి చిన్న పనికి హెలికాప్టర్ వేసుకువచ్చి హడావుడి చేసే మంత్రులు ఉమ్మడి జిల్లా అభివృద్ధిని మాత్రం పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు.రాష్ట్ర బడ్జెట్ 3లక్షల కోట్లు కాగా,అందులో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు చేయించిన కేటాయింపులెన్నో,ఎన్ని నిధులు తీసుకొచ్చారో, చేసిన ఖర్చెంతో, జరిగిన పనులెన్నో వివరిస్తూ వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి ప్రజల ముందు ఉంచాలని మంత్రులను డిమాండ్ చేశారు.మురసు తుపాను కారణంగా ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో వరి,మిర్చి,పత్తి,ఉద్యానవన పంటలు కోల్పోయి రైతన్నలు పుట్టెడు దుఃఖంతో ఉన్నారని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ జిల్లాలో 50వేల ఎకరాలకు పైగా పంటల నష్టం జరిగిందని, వెంటనే సమగ్ర సర్వే చేయించి రైతులకు సరిపడు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన 3 ప్రధానమైన శాఖలు కూడా ఈ మంత్రులు వద్దనే ఉన్నాయన్నారు.అయినా కూడా వీరు శ్రద్ధ చూపకుండా తాత్సారం చేస్తుండడం శోచనీయమన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాలో వరదల వల్ల పంటలు కోల్పోయిన రైతులను పరామర్శించి వెంటనే నష్ట పరిహారం అందజేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు.ఓ పక్క ఎల్ నినో కారణంగా కరువుతో అల్లాడుతున్న రాష్ట్రం,తుపాను వల్ల పంటలు కోల్పోయిన ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకుండా 3 మంత్రులు,అధికార యంత్రాంగంతో కలిసి కొడంగల్ నియోజకవర్గానికే పరిమితం కావడం విచారకరమన్నారు.గతంలో వచ్చిన వరదల్లో కొట్టుకుపోయిన పెద్దవాగు ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనులు పూర్తి కాకపోవడంతో నిన్నటి తుపాను వల్ల పూర్తిగా దెబ్బతిన్నదని ఎంపీ రవిచంద్ర చెప్పారు.బీమా సౌకర్యం ఉన్నా, లేకపోయినా పంటలు కోల్పోయిన రైతులందరికి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని,పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను మరింత వేగవంతం చేయాలని, రోడ్లు,కల్వర్టులను వెంటనే బాగు చేయాలని ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బేతుపల్లి చెరువు అలుగులో కొట్టుకుపోయిన వారిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఎంపీ వద్దిరాజు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాగర్‌కర్నూల్ విద్యార్థికి కాంస్య పతకం

బండారి గణేష్ ప్రతిభకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్ అభినందనలు

నాగర్‌కర్నూల్ నవంబర్ 07 (ప్రజా కలం) : 70వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నాగర్‌కర్నూల్‌కు చెందిన విద్యార్థి బండారి గణేష్ సత్తా చాటాడు. ఖమ్మం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో 3 కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించాడు. లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న గణేష్ సాధించిన విజయంపై ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కోచ్ రానా మల్లేష్ ఆధ్వర్యంలో గణేష్‌ను అభినందించి చిరు సన్మానం చేశారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఉంటే క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కోచ్ పేర్కొన్నారు. విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారంతో పాటు నిరంతర సాధన ప్రధాన కారణమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ అందించడంలో లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు



(వరంగల్/ పర్వతగిరి) నవంబర్ 07, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యత, దాని వెనుక ఉన్న ఉద్దేశం, మన సంప్రదాయాలు ఆచారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ.. దీపావళి వెలుగుల పండుగ అని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. దీపాలు వెలిగించడం ద్వారా మన ఇళ్లలోనే కాకుండా మన ఆలోచనల్లోనూ మంచి వెలుగును నింపుకోవాలని విద్యార్థులకు సూచించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలను గుర్తుచేస్తాయని, వాటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. చదువుతో పాటు మన పండుగలు, వాటి విశిష్టత, ఆచారాల గురించి కూడా విద్యార్థులు తెలుసుకోవడం అవసరమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. పెద్దలు పాటించే మంచి సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి వెనుక ఉన్న సందేశాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు వివరించారు. దీపావళిని ఆనందంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని, పర్యావరణం మరియు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు పండుగ విశేషాలను ఆసక్తిగా తెలుసుకొని, వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కొటగిరి రమేష్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కోతుల బెడదకు చెక్ పెట్టాలి!

-చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలపై దాడులు..

భయాందోళనలో గ్రామీణ, పట్టణ ప్రజలు

-కోతుల నియంత్రణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

-మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జనురాములు మాదిగ



నవంబర్ 07 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్దన్నపేట) రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా కోతుల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోందని మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జనురాములు మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. కోతుల దాడులతో చిన్నారులు, వృద్ధులు సహా సామాన్య ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇళ్లలోకి చొరబడుతూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, ఎదురుపడిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. వీటి దాడుల్లో పలువురు గాయపడటంతో పాటు, భయంతో పరుగులు తీస్తూ కిందపడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేకంగా స్పందించి కోతుల బెడదను రాష్ట్రస్థాయి తీవ్రమైన సమస్యగా పరిగణించాలని కోరారు. ఒక గ్రామానికో, మండలానికో, నియోజకవర్గానికో పరిమితమైన సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను వేధిస్తున్న ప్రజారోగ్య, ప్రజాభద్రత సమస్యగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర క్యాబినెట్‌లో ఈ అంశంపై చర్చించి కోతుల నియంత్రణ కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని సూచించారు. ఆ నిధులను నేరుగా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు అందజేస్తే స్థానిక సర్పంచులు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రతి గ్రామం, పట్టణాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కోతులను పట్టుకునే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. పట్టుకున్న కోతులను అటవీశాఖ అధికారుల సమన్వయంతో తగిన అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టి, తిరిగి జనావాసాల్లోకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఒకవైపు వీధికుక్కల బెడద, మరోవైపు కోతుల దాడులతో ప్రజలు నిత్యం భయాందోళనల మధ్య జీవిస్తున్నారని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని జనురాములు మాదిగ కోరారు.


పేదల ఇళ్లలో పండుగ వెలుగులు నింపేందుకు..

రేపు మంత్రి పొంగులేటి పర్యటన

పాలేరు నియోజకవర్గంలో మూడు మండలాల్లో షెడ్యూల్

'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాల్లో పాల్గొననున్న శీనన్న

పాలేరు నవంబర్ 07(ప్రజా కలం న్యూస్) ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రేపు (ఆదివారం) పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాల్లో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలను జరుపుకోనున్నారు.



పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం కామంచికల్‌లో, 9:30 గంటలకు నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో, 10:30 గంటలకు కూసుమంచి మండలం పాలేరులో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు. మూడు మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మమేకమై వారి ఇళ్లలో దీపావళి సంబరాలను పంచుకోనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెరకు రైతులకు తీపి కబురు..

టన్నుకు రూ.3,800 ధర ప్రకటన!

నవంబర్ 19 నుంచి మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు గానుగ ప్రారంభం



పాలేరు నవంబర్ 07(ప్రజా కలం న్యూస్)

నేలకొండపల్లి మండల పరిధిలోని చెరకు రైతులకు మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం తీపి కబురు అందించింది. 2026-27 చెరకు గానుగ సీజన్‌కు సంబంధించి కర్మాగారానికి చెరకు సరఫరా చేసే రైతులకు టన్నుకు రూ.3,800 ధర చెల్లించనున్నట్లు ప్రకటించింది. శనివారం మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెరకు రైతుల సమావేశంలో ఈ ధరను ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం టన్నుకు రూ.3,382.92, కర్మాగార యాజమాన్యం అదనంగా ప్రకటించిన ధర రూ.207.08, గత చెరకు నాటు సీజన్‌లో మొక్క మరియు పిలక తోటలకు ఇచ్చే రాయితీ కలిపి సగటున రూ.210 చొప్పున మొత్తం టన్నుకు రూ.3,800 చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కర్మాగార నిర్వహణ సంచాలకులు నామ కృష్ణయ్య మాట్లాడుతూ, గత రెండేళ్లుగా కర్మాగారానికి తక్కువ మొత్తంలో చెరకు సరఫరా కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల కష్టసుఖాలు తమకు తెలుసునని, తాము కూడా రైతు కుటుంబం నుంచే వచ్చామని పేర్కొన్నారు. రైతులందరూ యాజమాన్యానికి సహకరించి అధిక విస్తీర్ణంలో చెరకు సాగు చేయడంతో పాటు కర్మాగారానికి ఎక్కువ మొత్తంలో చెరకు సరఫరా చేయాలని కోరారు. 2026-27 చెరకు గానుగ సీజన్‌కు సంబంధించి ఈ నెల 16న ముహూర్త కార్యక్రమం నిర్వహించి, నవంబర్ 19 నుంచి చెరకు గానుగ ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో చెరకు రైతులతో పాటు కర్మాగార నిర్వహణ సంచాలకులు నామ కృష్ణయ్య, అదనపు ఉపాధ్యక్షులు కోటయ్య, చెరకు విభాగం ఉప ప్రధాన నిర్వాహకులు అప్పారావు, మానవ వనరుల విభాగం సహాయ ప్రధాన నిర్వాహకులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాల పంపిణీ

- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్

- మైనారిటీ అభ్యర్థులు నవంబర్ 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మం నవంబర్ 07(ప్రజా కలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలు అయిన గ్రూప్-1, 2, 3 , గ్రూప్-4 పరీక్షలు, అలాగే పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్ ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత కలిగిన మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ) అభ్యర్థులు తమ దరఖాస్తులను వి.వెంకటాయపాలెం లో గల కలెక్టరేట్ భవన సముదాయములో రెండవ అంతస్తు ఎస్-29 లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో నవంబర్ 10 వ తేదీ వరకు సమర్పించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు.హౌఇతర వివరాలకు మొబైల్ నెంబర్ 9704003002 ను సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ లో మారని తీరు

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీది అధికారంలో ఉన్నా, లేకపోయినా ఒకటే తీరు. అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న స్పృహ కూడా నేతల్లో లేకపోవడం విచారకరం. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ దీనికి మినహాయింపు కాదు.తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు బహిరంగంగా రగులుతున్నాయి. ఎన్ని సార్లు క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చినప్పటికీ ఫలితం మాత్రం లేదు. ఇంకా కుమ్ములాటలు, కొట్లాటలు, విమర్శలు, ప్రతి విమర్శలతో తమకు తామే పార్టీని నాశనం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తూ పదవులను పొందిన వారే ఈ పనులకు పాల్పడుతుంటంతో హస్తం పార్టీని ఎవరూ రక్షించలేరన్నది అర్థమయింది. ప్రజలకు చికాకు కలిగించేలా వీరి పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి. ఢిల్లీలో జరిగిన 'ఓట్ చోరీ' ర్యాలీ సమయంలో మంత్రి కి, ఎమ్మెల్యే కు మధ్య ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తదితర పదవుల నియామకాల విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుందని చెబుతన్నారు. దీంతో మంత్రిపై టీపీసీసీ నాయకత్వానికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పీసీసీ పరిధిలో విచారణ జరుపుతున్నారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ పరువు బజారున పడినట్లయింది. గాంధీ భవన్ లో నేత అంటే ఓర్పు, సంయమనం పాటించాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు కొట్లాటలకు దిగడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారనుంది. పార్టీలో క్రమశిక్షణ లోపానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నది పార్టీ నేతలే అంటున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 కోట్ల అభివృద్ధి బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా నిధుల కేటాయింపులు, టెండర్ల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో గిరిజన మహిళా నేత సస్పెన్షన్‌పై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి, పార్టీలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి విభేదాలను సరిదిద్దుతామని తెలిపారు.

పాగుంట బ్రహ్మోత్సవాలకు సర్పంచ్ శారదమ్మ ప్రత్యేక చొరవ.. భక్తుల కోసం సకల సౌకర్యాలు!

తాగునీరు, వీధి దీపాలు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు.. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారం



గద్వాల ప్రతినిధి, నవంబర్ 7 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలం వెంకటాపురం గ్రామ సమీపంలోని ప్రసిద్ధ పాగుంట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈ నెల 11వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ శారదమ్మ ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఉత్సవాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు సర్పంచ్ శారదమ్మ, ఉపసర్పంచ్ ఏ. మురళి తెలిపారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేకంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చి చదును చేయించారు. భక్తులు తమ వాహనాలను నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ఈ బ్రహ్మోత్సవాలకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ శారదమ్మ తెలిపారు.ఈ సందర్భంగా రైతులు, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ తిమ్మారెడ్డి ముందస్తుగా గ్రామ ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



దీపావళి శుభాకాంక్షలు





సోనోవిజన్ దీపావళి సేల్





5.75% పైన అదనపు డిస్కౌంట్ లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్

ప్రతి ₹2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి



₹100/- నుండి ₹1,00,000/- వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి.

(సెలెక్టెడ్ మోడల్స్ పై)





Diwali Excellent Cash Back Offers

Upto 45000/- క్యాష్‌బ్యాక్
Finance Purchases, Conditions Apply

BAJAJ FINANCE, IDFC FIRST Bank, HDB FINANCIAL SERVICES

Upto 26% క్యాష్‌బ్యాక్
EMI Purchases with Credit Card, Conditions Apply

UP TO ₹10,000 INSTANT DISCOUNT# SBI card

#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹10,000 per card; Also valid on EMI Trxns.; Validity: 10 Oct - 15 Nov 2026. T&C Apply.

స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు

రూ. 1,00,000/- విజేత



శ్రీ సి. అవినాష్ గారు
ఖుత్బుల్లాపూర్, హైదరాబాద్.
9014434856

రూ. 1,00,000/- విజేత



శ్రీ జి. నాగరాజు గారు
గాంధిచౌక్, ఖమ్మం.
9502858462

రూ. 50,000/- విజేత



శ్రీ పి. శ్రీనివాస్ గౌడ్ గారు
హమాలి కాలని, కొత్తగూడెం.
9491356911

రూ. 50,000/- విజేత



శ్రీ డి. రమేష్ గారు
నల్గొండ, మిర్యాలగూడ.
7997461477



visit web site : www.sonovision.in

LG SAMSUNG SONY Haier LLOYD TCL Godrej VOLTAS BOSCH Whirlpool DAIKIN Carrier BPL IFB BLUE STAR Panasonic HITACHI JBL PHILIPS Hisense
vivo oppo iPhone MacBook SAMSUNG Redmi NOTHING Pixel Lenovo hp DELL ASUS BAJAJ Preethi Prestige Butterfly KEELINE morphy richards KENT EUREKA FORBES FABER pureit

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

Next to హైదరాబాద్ సెంట్రల్, పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181, 9154281183, 84

పిల్లర్ నెం. 799, మెట్రోస్టేషన్ దగ్గర, బిగ్‌బజార్ ప్రక్కన, కూకట్‌పల్లి, హైదరాబాద్. 2842188, 2843188, 9154281180, 81, 82

మంజీర వాటర్ వర్క్స్ ఎదురు, మెట్రోపిల్లర్ 658, హైదర్‌నగర్, మియాపూర్, హైదరాబాద్. 7331149363, 64, 65

యషోద హాస్పిటల్ ఎదురు, మలక్‌పేట, హైదరాబాద్. 24542090, 9154281187, 8333924932, 33

డి-మార్ట్ దగ్గర, ఎల్.బి.నగర్, హైదరాబాద్. 9154281188, 8333924940, 41

బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్, హైదరాబాద్. 8712648707, 708, 709

గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ 8712635851, 52, 53

ప్యారడైస్ కాలని, షాద్‌నగర్, ఫారూఖ్ నగర్, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 8712648701, 02, 03. / సున్నంభట్టీల నగర్, తొల్లవాగు, మంచిర్యాల. 8712417845, 46, 47

తండ్రి బాటలో వంగవీటి రాధా



విజయవాడ : విజయవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు కార్పొరేటర్‌గా మొదలైన ఆ కుటుంబ రాజకీయ ప్రస్థానం.. ఎమ్మెల్యే పదవి మీదుగా ఇప్పుడు నగర మేయర్ పీఠం వరకు చేరింది. తండ్రి వంగవీటి మోహన రంగా రాజకీయాల్లో సంపాదించుకున్న గుర్తింపును కొనసాగిస్తూ ఆయన కుమారుడు వంగవీటి రాధాకృష్ణ మరో కీలక విజయాన్ని అందుకున్నారు. 25 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. ఇప్పుడు 47 ఏళ్లకు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధా.. వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై 1,30,912 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఏబీ వెంకటేశ్వరరావుకు 12,642 ఓట్లు వచ్చాయి.వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లోకి రావడానికి ముందే ఆయన కుటుంబానికి విజయవాడలో బలమైన రాజకీయ పునాది ఉంది. తండ్రి మోహన రంగా 1985లో విజయవాడ తూర్పు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన హత్య అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన తల్లి రత్నకుమారి కూడా అదే నియోజకవర్గం నుంచి 1989, 1994 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు.అయితే 1999 ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. టీడీపీలో చేరిన రత్నకుమారికి ఆ ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఆమె స్థానంలో బరిలోకి దిగిన సినీ నటుడు కోట శ్రీనివాసరావు విజయం సాధించారు. ఈ పరిణామాల తర్వాత వంగవీటి కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేందుకు రాధాకృష్ణ సిద్ధమయ్యారు.2003 చివర్లో రాధాకృష్ణ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. డిసెంబర్ 26న మోహన రంగా వర్ధంతి సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సభలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దాసరి నారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మరుసటి ఏడాదే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటికి ఆయన వయసు కేవలం 25 ఏళ్లు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టడం రాధాకృష్ణ రాజకీయ జీవితంలో తొలి పెద్ద మైలురాయిగా నిలిచింది.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాధాకృష్ణ రాజకీయ ప్రయాణం ఒకే పార్టీలో సాగలేదు. 2008లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేసినా విజయం దక్కలేదు. తర్వాత 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి మరోసారి అదృష్టం పరీక్షించుకున్నప్పటికీ ఓటమి ఎదురైంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఆయన.. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. 2024 ఎన్నికల సమయంలోనూ కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కవచ్చని, మంత్రి పదవి కూడా రావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. కానీ చివరకు ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపు తిరిగిందిటీడీపీలో సుమారు ఏడేళ్లు కొనసాగిన రాధాకృష్ణ.. విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా మేయర్ ఎన్నికల్లో పోటీకి దిగారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి వచ్చిన ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యేగా మొదలైన ఆయన ఎన్నికల ప్రస్థానంలో మరో కీలక ఘట్టం చేరింది.వంగవీటి కుటుంబానికి విజయవాడ నగర రాజకీయాలతో ఉన్న అనుబంధం ఈ విజయంతో మరోసారి తెరపైకి వచ్చింది. 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మోహన రంగా కృష్ణలంకలోని 40వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచారు. అప్పటికి ఆయన ఓ హత్య కేసులో జైలులో ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించడం అప్పట్లో ప్రత్యేకంగా నిలిచింది. కార్పొరేటర్‌గా మొదలైన మోహన రంగా రాజకీయ ప్రస్థానం తర్వాత ఎమ్మెల్యే స్థాయికి చేరింది. ఇప్పుడు అదే నగరంలో ఆయన కుమారుడు మేయర్ ఎన్నికల్లో గెలుపొందారు. తండ్రి నగర కార్పొరేటర్‌గా పనిచేసిన చోట కుమారుడు మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ఈ కథనంలో మరో ఆసక్తికరమైన అంశం.1979లో కృష్ణా జిల్లా పెనమలూరులో జన్మించిన రాధాకృష్ణ.. గుంటూరులో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం తమిళనాడులోని సేలంలో వినాయక మిషన్స్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివేందుకు చేరారు. అయితే వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి రాజకీయాల వైపు అడుగులు వేశారు. అలా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం ఇప్పుడు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయంతో మరో మైలురాయిని చేరుకుంది.

ఏపీలో మరో నేషనల్ హైవే విస్తరణ

కడప టు రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే

కడప : ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవేలు, రోడ్లపై కేంద్రం ఫోకస్ పెట్టింది.. కేంద్రం సహకారంతో హైవే విస్తరణ ప్రాజెక్టుల్ని చేపట్టారు. కడప టు చెన్నై హైవేలో కొన్నేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు దాదాపు 50 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతింది. శేషాచలం అడవి, ప్రమాదకర మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరిగేవి. అందుకే కడప టు చెన్నై హైవేను రెండు వరసలు నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని ఐదేళ్ల క్రితం నిర్ణయించింది. అయితే పనులు మాత్రం ప్రారంభంకాలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్-716లో కడప-రేణిగుంట సెక్షన్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. మొత్తం122 కిలోమీటర్లకు గాను అంచనా వ్యయం రూ. 2,254 కోట్లుగా ఉంది.కేంద్రం నేషనల్ హైవే 716కి అనుసంధానంగా కడప నుంచి రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ప్లాన్ చేసింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ తగ్గించొచ్చని భావించారు. కడప, భాకరాపేట, ఒంటిమిట్ట, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, మామండూరు మీదుగా రేణిగుంట వరకు నాలుగు లైన్లుగా హైవేను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో కడప నుంచి రేణిగుంట వెళ్లేందుకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఈ హైవే విస్తరణ పూర్తయితే కేవలం రెండు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. అలాగే వాహనాల రద్దీ తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రజా రవాణాతో పాటుగా వ్యవసాయ, వాణిజ్య రంగాలకు ఉపయోగంగా ఉంటుందంటున్నరు.2021లోనే కేంద్రం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. 2024 వరకు అసలు పనులు ప్రారంభించలేదు. కేంద్రంతో సంప్రదింపులు జరపకపోవడంతో పాటుగా అటవీశాఖ అనుమతులు రావడంలేదన్న కారణాలతో పనులు పక్కన పెట్టారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 అక్టోబరులో పనులు ప్రారంభించారు.. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలన్న టార్గెట్ పెట్టుకున్నారు. అటవీ శాఖ అనుమతులతో పాటుగా నిధుల విడుదల, భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తి చేశారు. ప్రస్తుతం కడప జిల్లాలో పనులు స్పీడ్ అందుకున్నాయి.

అలాగే రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ భూమిలో చెట్ల తొలగింపు కొనసాగుతోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే తిరుపతి, చెన్నై వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

కడప నుంచి రేణిగుంటకు.. అక్కడి నుంచి తిరుపతికి రెండున్నర గంటల్లోనే వెళ్లొచ్చన్నారు. మొత్తానికి 2027 నాటికి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్ని పూర్తి చే?యలనే లక్ష్యంతో పనుల్ని మరింత వేగవంతం చేశారు.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...

నెల్లూరు : రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గుమ్మడి సంధ్యారాణికి డేంజర్ బెల్స్

విజయనగరం : మంత్రిగా ఉండి కూటమి ఆదేశాలను ధిక్కరించడం ఈ ఎన్నికల్లో హైలెట్ అనే చెప్పాలి. కూటమి నిర్ణయించిన అభ్యర్థులను కాకుండా తన సొంత అనుచరులకు పదవులను కట్టబెట్టాలన్న మంత్రిగారి తపన కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీకి తలనొప్పిగా మారింది. గుమ్మడి సంధ్యారాణి వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి పొత్తును ధిక్కరించడంతో పాటు తమ అనుచరులను రెబల్ గా దించి ఏదో సాధిద్దామని భావించి చతికలపడుతున్నారు.ఇక విషయానికి వస్తే కూటమి పొత్తుని దిక్కరించి, రాష్ట్ర స్తాయి సర్దుబాటులో జనసేనకి ఇచ్చిన సాలూరు మున్సిపాలిటీని జనసేనకి వదలకుండా టీడీపి నుండి రెబల్‌ని దింపి, ప్రచారం కూడాచేసారు. ఎక్కడా పొత్తు దర్మాన్ని పాటించకుండా వార్డుల్లో కూడా జనసేన మీద పోటీ పెట్టారు. ఇది గుమ్మడి సంధ్యారాణికి అవమానంగానే చూడాలి. తొలిసారి ఎమ్మెల్యే అయి, తొలిసారి మంత్రి పదవి లక్కుతో పొంది పార్టీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించడాన్ని పలువురు మిత్ర పక్ష పార్టీ నేతలు తప్పుపడుతున్నారు సాలూరు నియోజకవర్గానికి గుమ్మడి సంధ్యారాణి తొలిసారి గెలిచారు. ఒకరకంగా చెప్పాలంటే సాలూరు నియోజకవర్గంలో టీడీపీకి పట్టులేదు. కూటమి హవాలో గెలిచారు. గతంలో రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయిన గుమ్మడి సంధ్యారాణి గాలి వాటంలో గెలిచారు. తనకున్న సామాజికవర్గం కారణంగా ఎమ్మెల్సీ పదవిని అంతకు ముందు పొందారు. టీడీపీకి నమ్మకమైన నేతగా నిలిచినప్పటికీ గుమ్మడి సంధ్యారాణి మున్సిపల్ ఎన్నికల్లో సాలూరు మున్సిపాలిటీలో రెబల్ ను బరిలోకి దించి తమ పార్టీ నేతలకే సవాల్ విసిరారు. కానీ మంత్రి గారి చర్యలను కూటమి పార్టీల కార్యకర్తలు సమర్థించలేదు. కూటమిలో పొత్తులో భాగంగా అది జనసేనకు కేటాయించారు. కానీ తన అనుచరుడి కోసం రెబల్ గా దించి తప్పు చేశారంటూ సొంత పార్టీ నేతలే మంత్రిగారి మీద కారాలు, మిరి?యలు నూరుతున్నారు. మరొకవైపు జనసేన నేతలు కూడా ఇప్పటకే మంత్రి గుమ్మడి సంధ్యారాణిపై తమ పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.... అయితే జనసేన అభ్యర్థి గెలవడంతో ఇక గుమ్మడి సంధ్యారాణి సీన్ చెప్పకనే తెలిసిపోయిం దంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికలతో ఊరుకోని గుమ్మడి సంధ్యారాణి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ తన మద్దతుదారులను రెబల్ గా బరిలోకి దింపారు. జనసేన కు దక్కాల్సిన వాటాను తాము దక్కించుకుని క్రెడిట్ కొట్టేయాలనుకున్న మంత్రి గారి ఆలోచన రివర్స్ అయిందనే అనుకోవాలి.కూటమి లోని టీడీపీ నాయకత్వం కూడా గుమ్మడి సంధ్యారాణిపై చర్యలు తీసుకోకపోవడం ఒకింత జనసైనికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. సాలూరులోవరసగా కాంగ్రెస్, వైసీపీలు మూడు ఎన్నికల్లో గెలిచాయి. కానీ మొన్న గాలివాటాన గెలిచిన గుమ్మడి సంధ్యారాణి మాత్రం తాను ఏదో పెద్ద లీడర్ అని పోజులివ్వడం మాత్రం సొంత పార్టీ నేతలకే నచ్చడం లేదు.ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే గుమ్మడికి మంత్రి పదవి ఊడటం ఖాయమన్న కామెంట్స్ కూటమి పార్టీల నేతల నుంచి వినిపిస్తుంది.

డిప్యూటీ మేయర్... బీజేపీ వర్సెస్ జనసేన

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం కు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అద్భుతమైన ఫలితాలు సాధించడంతో ఇప్పుడు పదవుల పంపకాలపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్నది మూడు పార్టీల్లోనూ ఉత్కంఠ రేపుతోంది.విశాఖలో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి బలమైన పట్టు ఉంది. భారతీయ జనతా పార్టీకి కూడా కొన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉండగా, జనసేనకు సామాజిక సమీకరణల పరంగా ఓటు బ్యాంకు ఉంది. ఈ మూడు పార్టీల బలాలు కలవడంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 120 వార్డులకు గాను 98 స్థానాలను అధికారిక కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించినప్పటికీ, వారు కూటమికి చెందిన రెబల్స్ కావడం గమనార్హం. దీంతో కూటమి వైపు మొత్తం 106 మంది కార్పొరేటర్ల మద్దతు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ 13 స్థానాలతో ప్రతిపక్షంలో ఉండనుండగా, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకుంది.మేయర్ పదవి టీడీపీకి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానంపై బీజేపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. విశాఖలో తమకున్న రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మేయర్ పదవిని ఇవ్వాలని బీజేపీ గతంలోనే కోరినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో ఎంపీ స్థానం కూడా కేటాయించకపోవడంతో కనీసం డిప్యూటీ మేయర్ పదవైనా ఇవ్వాలని టీడీపీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పొరేటర్‌గా పోటీ చేశారని, ఆయనకు డిప్యూటీ మేయర్ అవకాశం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆయన పేరు ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా ఈ పదవి తమ పార్టీకి దక్కేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.మరోవైపు జనసేన కూడా డిప్యూటీ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకుంది. విశాఖలో 26 మంది కార్పొరేటర్లతో కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా ఉన్న తమకు ఈ అవకాశం ఇవ్వడం సమంజసమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కేవలం ఎనిమిది మంది కార్పొరేటర్లు ఉన్న బీజేపీకి కాకుండా, తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఇచ్చిన రాజకీయ హామీలను పరిగణనలోకి తీసుకుంటే తమకే అవకాశం వస్తుందని బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారు.ఉత్తరాంధ్ర రాజకీయ సమీకరణాలు కూడా ఈ పదవుల పంపకంలో కీలకంగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం, విజయనగరం కార్పొరేషన్లలో టీడీపీకి ప్రాధాన్యత దక్కగా, రాబోయే శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు అవకాశం కల్పించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవసరమైతే విజయనగరంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో విశాఖ మేయర్ పదవిని బీజేపీ గెలుచుకున్న చరిత్ర కూడా ఆ పార్టీ నేతలకు గుర్తుంది. ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానం దక్కితే నగర రాజకీయాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చని భావిస్తున్నారు. అయితే జనసేన కూడా తన బలాన్ని తక్కువగా అంచనా వేయకూడదని పట్టుబడుతోంది. దీంతో చివరకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ డిప్యూటీ మేయర్ పీఠం బీజేపీకి దక్కుతుందా? లేక జనసేన తన బలంతో ఆ స్థానాన్ని సాధించుకుంటుందా? అన్నది త్వరలో తేలనుంది.

ముక్కా శ్రావణి. తమ కుటుంబం ముప్పై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉందని.. అందుకే తమకు ఈ అవకాశం దక్కిందన్నారు. కూటమి పార్టీల్లో అనుభవం ఉన్న నేతల సహకారంతో విశాఖపట్నాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానన్నారు.ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు.. ఆయన గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. శ్రీవాణి వృత్తిరీత్యా ఫిజియో థెరపిస్ట్ కాగా.. ఆమె రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2015 నుంచి టీడీపీలో యాక్టివ్ అయ్యారు.. 2021 ఎన్నికల్లో 26వ వార్డు (అక్కయ్యపాలెం ప్రాంతం) నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందారు. అలాగే ముక్కా శ్రావణి తన డివిజన్‌లో పనులకు సంబంధించి నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఇటీవల ఆమెకు టికెట్ ప్రకటించిన తర్వాత ఆ వీడియో సోషల్ మీడియాలో మళ్లీ చక్కర్లు కొట్టింది. వైరల్ అయిన వీడియోలో ఏదో ఒకరోజు తమకు టైం వస్తుందన్నారు.. చెప్పినట్లుగానే ఆమె విశాఖ నగరానికి మేయర్ అయ్యారు.అంతేకాదు కూటమి పార్టీల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటుతో కొంత గందరగోళం ఏర్పడింది.

మొత్తం 120 వార్డుల్లో 246మంది స్వతంత్రులు పోటీచే చేశారు. కూటమి పార్టీల్లో కూడా రెబల్స్ పోటీచేసి గెలిచారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 36వ వార్డులో కొల్లి సింహాచలం (జనసేన పార్టీ రెబల్), . అగనంపూడి జోన్ 106 వార్డులో రామునాయుడు (జనసేన పార్టీ రెబల్) గెలుపొందారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం 73వ వార్డులో పెతకంశెట్టి శ్యాం సుధాకర్‌రావు (జనసేన పార్టీ రెబల్). 39, 41 వార్డుల్లో (టీడీపీ రెబల్స్) బత్తిన నవీన్, పంపాన రాజ్యలక్ష్మిలు విజయం సాధించారు. 118 వార్డులో (పెందుర్తి) టీడీపీ రెబల్ గంట్ల లక్ష్మి గెలిచారు.గాజువాక 86 వార్డులో కాకి గోవిందరెడ్డి (టీడీపీ రెబల్) బరిలో విజయాన్ని అందుకున్నారు.

విశాఖపట్నం జీవీఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా.. ఇప్పుడు అందరి దృష్టి డిప్యూటీ మేయర్ పదవివైపు మళ్లింది. ఈ పదవి కూటమిలో ఏ పార్టీకి దక్కుతుందనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ మేయర్ రేసులో ప్రధానంగా విశాఖపట్నం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశరామరాజు పేరు వినిపిస్తుంగా.. ఆయన 54వ డివిజన్ నుంచి గెలిచారు.

తుఫాన్ సహాయక చర్యలను రైతులకు వివరించిన సీఎం చంద్రబాబు

గుంటూరు : అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వచ్చింది. తుఫాన్ల వల్ల పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ల వల్ల రైతులు నష్టపోయారు.ఎల్ నినో వల్ల రైతులు గడ్డు పరిస్థితుల్లో ఉంటే... పట్టిసీమ ద్వారా నీళ్లందిస్తే రైతులు పంట వేసుకున్నారు. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుఫాన్ రైతులను దెబ్బతీసింది. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చాలా వరకు నష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అయన రేటూరు దగ్గర రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలను మురసు తుఫాన్ బాగా ఇబ్బంది పెట్టింది.ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం.పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీతో నష్ట పోయిన పెట్టుబడిని రైతులు దక్కించుకోవచ్చు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు చేస్తే ఎవ్వరూ తేలిగ్గా తీసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ముందస్తు చర్యలతోనే చాలా వరకు ఆస్తి నష్టాన్ని తగ్గించి.. సహాయక చర్యలు వేగంగా చేపట్టగలిగామని అన్నారు. తుఫాన్ సహాయ చర్యల కోసం తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు నుంచి సాయం తీసుకుంటున్నాం. అర్నబ్ తుఫాన్ వల్ల నేల కొరిగిన 30 వేల విద్యుత్ స్థంభాలను పునరుద్దరించగలిగాం. మురసు తుఫాన్ వల్ల కూడా మరో 10 వేల విద్యుత్ స్థంభాలు దెబ్బతిన్నాయి. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్దరిస్తున్నాం. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నాం. తుఫాన్ల ప్రభావితంపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాం. తుఫాన్ల ప్రభావంపై ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందేంత వరకు పని చేస్తామని అన్నారు.నల్లమడ డ్రైన్ కు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. గత పాలనలో తుఫాన్లు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి...పరామర్శించారు.

ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే ముఖ్యంగా భావించి తుఫాన్ల సమయంలో పనిచేశాం కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బందిగా పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. అన్ని విషయాలు మాట్లాడతాం.తీర ప్రాంతాలను తుఫాన్లు దెబ్బతీస్తే... రాయలసీమ ప్రాంతాన్ని ఎల్ నినో ఇబ్బంది పెట్టింది. రాయలసీమలో కూడా కరువును అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించాయి. తీర ప్రాంతంలో నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతుంటే... రాయలసీమ ప్రాంతం నీటి కొరతను ఎదుర్కొంటోంది.అందుకే నీటి భద్రతకు.. సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

కల్తీపాలు ముఠా గుట్టురట్టు

హైదరాబాద్ : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పాల దందాను మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు బట్టబయలు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న కల్తీ పాల తయారీ కేంద్రంపై నిన్న రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేసి, భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు.పోచారం గ్రామానికి చెందిన ఆండే శ్రీశైలం (43) అనే వ్యక్తి తన ఇంట్లోనే రహస్యంగా ఈ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పాల పొడిలో నీళ్లు, ప్రమాదకరమైన రసాయనమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను కలిపి సింథటిక్ పాలను తయారు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పక్కా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ బృందం మెరుపుదాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుంది.ఘటనా స్థలం నుంచి 100 లీటర్ల కల్తీ పాలు, 35 కిలోల 'ధోల్‌పూర్' బ్రాండ్ పాలపొడి, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాలు కలపడం ఆరోగ్యానికి ప్రమాదకరం. ఇది క్రిమిసంహారకంగా కొన్ని పారిశ్రామిక, శుభ్రపరిచే అవసరాల్లో ఉపయోగించే రసాయనం. దీన్ని కలిపిన పాలు తాగితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. కడుపులో మంట, నొప్పి, వాంతులు, విరేచనాలు రావచ్చు. అధిక మోతాదులో రసాయనం చేరితే కడుపు, పేగుల లోపలి పొర దెబ్బతినే ప్రమాదం ఉంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ మోతాదు, గాఢత ఎక్కువగా ఉంటే అంతర్గత గాయాలు, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. తీవ్రమైన సందర్భాల్లో రక్తనాళాల్లో ఆక్సిజన్ బుడగలు ఏర్పడి రక్తప్రసరణకు ఆటంకం కలిగించే గ్యాస్ ఎంబాలిజం సంభవించవచ్చు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు.





ప్రవల్లిక మృతి తర్వాత ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్ : మహిళా కండక్టర్ ప్రవళిక మృతి తెలంగాణ ఆర్టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది.ఆర్టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.ప్రవళిక కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలాఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

అయ్యప్ప సొసైటీ భూమి పై రీ సర్వే చేయాలి

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

ఓడినా ప్రజల మనసు గెలిచామని వ్యాఖ్య

విశాఖపట్టణం : విశాఖ మేయర్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఓటమి అనంతరం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి స్పందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు తమకు ఓటు వేసిన ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో, నూతన మేయర్‌గా ఎన్నికైన కూటమి అభ్యర్థి ముక్కా శ్రావణికి అభినందనలు తెలియజేశారు.అధికారం, డబ్బు, మూడు పార్టీల కూటమి బలాన్ని తట్టుకుని వైసీపీ శ్రేణులు వీరోచితంగా పోరాడాయని కొనియాడారు. ఎన్నికల్లో విజయం సాధించలేకపోయినా, విశాఖ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో ఓటేసిన సుమారు 3.40 లక్షల మంది ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.నూతన పాలకవర్గానికి ఆమె కీలక సూచన చేశారు. విశాఖ ప్రజల కష్టార్జితమైన రూ.1,700 కోట్ల జీవీఎంసీ నిధులను దారి మళ్లించారని, కొత్త పాలకవర్గం తమ అధికారాన్ని ఉపయోగించి ఆ నిధులను తిరిగి జీవీఎంసీకి రప్పించాలని కోరారు. ఆ నిధులతో నగరంలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజాక్షేత్రంలోనే ఉంటానని వరుదు కల్యాణి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీగా, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ప్రజల హక్కుల కోసం, ముఖ్యంగా మహిళలపై జరిగే అరాచకాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని తెలిపారు.



36వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సిద్దిపేట జిల్లా జట్టు సన్నద్ధం

- దుద్దెడలో శిక్షణ శిబిరాన్ని సందర్శించి క్రీడాకారులను అభినందించిన దేవి రవీందర్

గజ్వేల్ నియోజకవర్గం:07 నవంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

36వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు సిద్దిపేట జిల్లా జట్టు సిద్ధమవుతోంది. ఈ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దుద్దెడ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్,స్థానిక సర్పంచ్ శివకుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడి వారిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన కబడ్డీ క్రీడ శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని దేవి రవీందర్ అన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. యువ క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కబడ్డీ క్రీడను ప్రోత్సహిస్తూ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శివకుమార్‌తో పాటు ఆయన బృందాన్ని అభినందించారు. అనంతరం క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించి, నవంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో నిర్వహించనున్న 36వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సిద్దిపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు ప్రసాద్, కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సత్యం,జాయింట్ సెక్రటరీలు శ్రీకాంత్, చిన్న నర్సు,కరుణాకర్,దుద్దెడ కబడ్డీ క్లబ్ ప్రధాన కార్యదర్శి రోషిలి కిషన్, కోచ్ సంపత్,పల్లె కరుణాకర్,మొదటి వార్డు సభ్యుడు కందుగుల కరుణాకర్,క్లబ్ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రామునిగుండ్ల తండాలో ప్రారంభించిన సర్పంచ్ బానోతు గోపీ నాయక్

బీబీనగర్,నవంబర్ 07 (ప్రజాకలం): రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రామునిగుండ్ల



తండ సర్పంచ్ బానోతు గోపీ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని రామునిగుండ్ల తండా గ్రామపంచాయతీ పరిధిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రావణి–శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ బాలరాజ్, వీఓ లింగ నాయక్, వార్డు సభ్యుడు బుజ్జి, మాజీ ఉపసర్పంచ్ బిక్షపతి, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ఎమ్మెల్యేకు వినతి

బస్సుల సంఖ్య పెంచాలని కోరిన కాంగ్రెస్ నాయకులు

భువనగిరి, నవంబర్ 07 (ప్రజాకలం): మహాదేవపూర్ పరిధిలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి శనివారం భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మహాదేవపూర్ నుంచి ఆయా గ్రామాలకు బస్సులు సక్రమంగా నడవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బస్సులు సరిగా నడవడం లేదని, దీంతో విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారని తెలిపారు. బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. గ్రామాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్య పెంచడంతో పాటు నిర్ణీత సమయాల్లో సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్, కొండమడుగు సర్పంచ్ అరెగే శ్రీధర్, మహాదేవపూర్ ఉపసర్పంచ్ భవాని కరుణాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు వెంగల రాజశేఖర్ రెడ్డి,మాజీ చైర్మన్ కావడపు శివారెడ్డి, బొడ్డు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ మార్చాలి

- పరీక్షల మధ్య కనీసం ఒక రోజు విరామం కల్పించాలి

- రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారికి విద్యార్థి సంఘాల వినతి

- సానుకూలంగా స్పందించిన విశ్వవిద్యాలయ అధికారులు



నిజామాబాద్, నవంబరు 7 (ప్రజాకలం ప్రతినిధి):

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో నిర్వహించనున్న ఐదో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను సవరించాలని విద్యార్థి సంఘాలు కోరాయి. పరీక్షల మధ్య కనీసం ఒక రోజు విరామం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శనివారం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారిని కలిసి వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వరుసగా ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించనుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక పరీక్ష పూర్తయిన మరుసటి రోజే మరో పరీక్ష ఉండటంతో విస్తృతమైన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవడానికి తగిన సమయం లభించడం లేదన్నారు. ముఖ్యమైన అంశాలను మరోసారి చదువుకోవడంతోపాటు పరీక్షలకు మానసికంగా సిద్ధమయ్యేందుకు తగిన సమయం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షల మధ్య కనీసం ఒక రోజు విరామం కల్పించేలా షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు విద్యార్థి సంఘాల వినతిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షల షెడ్యూల్‌లో అవసరమైన మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు విజయ్, అరవింద్, గాయత్రి, శ్రీజ, దివ్య, మానస, గంగలక్ష్మి, రిషిక, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జీడిమెట్ల ఈఎస్ఐ హాస్పిటల్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) జీడిమెట్ల ESI హాస్పిటల్ కార్మికుల సమావేశం మెడికల్ ఎంప్లాయ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ(అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎండి.యూసుఫ్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈసమావేశానికి అతిధిగా విచ్చేసిన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా మాట్లాడుతూ... కార్మికులందరు ఐక్యమత్యంతో సంఘముగా ఏర్పడినప్పుడే మన సమస్యలను సాధించు కుంటామని కార్మికులకు రావలసిన మూడు నేలల జీతాలు సదరు కాంట్రాక్టర్ చెల్లించకపోవడం అన్యాయమని ఇట్టి విషయాన్ని హాస్పిటల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకొస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు హరినాథ్ రావ్ లు పాల్గొన్నారు . జీడిమెట్ల ESI హాస్పిటల్ ఏఐటీయూసీ కమిటీని ప్రకటించారు.

అధ్యక్షులుగా వాణి, ప్రధాన కార్యదర్శి గిరి, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, షహనాబేగం. సెక్రెటరీలు సోని, బాబురావు, చంద్రకళ, కోశాధికారి కుమారస్వామి గౌరవ అధ్యక్షులుగా హరినాథరావు, సలహా దారునిగా శ్రీనివాస్ ల ను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ESI కార్మికులు నాగరాజీ, పుష్పలత, శుభాషిణి, రజని, యాదమ్మ, గంగమ్మ, కవిత, సువర్ణ, గిరి, శాంతబాయ్ తదితరులు పాల్గొన్నారు



మెడికల్ షాపుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు వినతి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

మేడ్చల్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యరమాద హరినారాయణ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు శనివారం షాపూర్ నగర్‌లోని నివాసంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇటీవల డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు మెడికల్ షాపులపై నిర్వహించిన తనిఖీల అనంతరం పలు షాపులకు నిరవధిక సస్పెన్షన్లు విధించడంతో కెమిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం సంబంధిత మంత్రి, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బ్రహ్మానందం, ముక్తార్ అలీ, కృష్ణగౌడ్, మధుగౌడ్, మొహమ్మద్ షాకీర్, ప్రభాకర్ గౌడ్, సంతోష్ గౌడ్, నరేష్ గౌడ్, సునీల్ గౌడ్, అభిరామ్ గౌడ్, ప్రదీప్ గౌడ్, ప్రవీణ్, రాము, సంగమేష్, నవీన్, అశోక్, షాజహాన్, రాజశేఖర్, శ్రీధర్ గుప్తా, శ్రీధర్, రాజు, విక్రమ్, సత్యనారాయణ తదితర కెమిస్టులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వలిగొండ నవంబర్ 5 ప్రజాకలం:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగెం,వర్కట్పల్లి,గోకారం,జాలు కాలువ,బోల్లపల్లి బుర్లగడ్డ,గ్రామాలలో (ఐకెపి) మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం రోజున వివిధ గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులకు ధాన్యాన్ని అమ్ముకొని మోసపోకుండా, ఐకెపి కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మి సరైన మద్దతు ధర పొందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యంకు ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటకు ఎ గ్రేడ్ కు రూపాయలు 2461/,సాధారణ రకంకు 2441/-,పొందాలంటే రైతులు వరి ధాన్యంపై నాణ్యత ప్రమాణాలు పాటించాలని,తాలు లేకుండా ధాన్యాన్ని మార్కెట్ కు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తాడూరి లలిత లింగస్వామి, సోలిపురం రమణమ్మ జనార్దన్ రెడ్డి,నూతి ఇందిర రమేష్ రాజు,మద్దెల మంజుల సందీప్,చిన్నంశెట్టి రాణి మధు, ఏపిఎం అంజయ్య,మండల సమాఖ్య అధ్యక్షురాలు తిరుపతమ్మ,మాజీ సర్పంచులు కిసిరి రాంరెడ్డి,కాసుల కృష్ణ,బాతరాజు బాల నరసింహ,జక్కుల వెంకటేష్, సీసీ అశోక్,మీసాల నరేష్, గంగాపురం నరేష్,పగుళ్ళ భార్గవి,నీరజ,సరిత, అన్నపూర్ణ, రేణుకా, లింగమ్మ,శ్రీలత, ఇందిరా,వసుమతి,ఉప్పలమ్మ, భానురేఖ,వనజ, మణెమ్మ,సులోచన,వివిధ గ్రామల ప్రజలు ,రైతులు,మహిళ సంఘాల సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

- కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి..

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్

గజ్వేల్, నవంబర్ 07 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట ఆర్టీసీ డిపోలో కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై డిపో మేనేజర్‌ను వెంటనే సస్పెండ్ చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. కార్మికులందరి సమక్షంలో డిపో మేనేజర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ డిపోలోని కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్మిక నాయకులు,కార్మికులు డిపో మేనేజర్‌ను కలిసేందుకు వెళ్లిన సమయంలో వారితో దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. కార్యాలయంలో కుర్చీలు అందుబాటులో ఉన్నప్పటికీ, కార్మికులను కింద కూర్చోబెట్టి అవమానించేలా ప్రవర్తించారని విమర్శించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, అభివృద్ధి కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న కార్మికుల పట్ల అధికారులు



గౌరవప్రదంగా వ్యవహరించాలని అన్నారు. సంస్థలోని అన్ని విభాగాల కార్మికుల సేవలను గుర్తించి,వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన బండ్ల స్వామి,డిపో మేనేజర్‌పై ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్టీసీ కార్మికులందరినీ కలుపుకొని ఈ అంశంపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

దీపావళి వేళ పేకాట ఆడితే కఠిన చర్యలు

: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హెచ్చరిక

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 07:

దీపావళి పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పేకాటను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ఎక్కడైనా పేకాట ఆడినా లేదా ఆడించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



పండుగ నేపథ్యంలో కమిషనర్ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు:

కఠిన నిఘా – స్పెషల్ టీమ్స్: పేకాట స్థావరాలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక బృందాలను (స్పెషల్ టీం లు) రంగంలోకి దించినట్లు, పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు.

ఆఫీసర్లకు ఆదేశాలు: పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పేకాటపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సమాచారం అందిన వెంటనే దాడులు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సహకరించిన వారిపై చర్యలు: పేకాట ఆడటమే కాకుండా, స్థావరాలు నిర్వహించినా, ఇతరులను ప్రోత్సహించినా లేదా సహకరించినా వారిపై కూడా కఠినమైన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పేకాట ఆడుతున్నా లేదా స్థావరాలు నిర్వహిస్తున్నా వెంటనే నిజామాబాదు పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీపీ స్పష్టం చేశారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ దీపావళి పండుగను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు, పోలీసుల మధ్య సోదరభావం పెంపొందాలి

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)నవంబర్ 07:

దీపావళి పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ నగర మరియు జిల్లా ప్రజలందరికీ పోలీస్ కమిషనర్ నవంబర్ 8వ తేదీ (ఆదివారం) సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి నిండు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సమాజంలో అహంకారం, స్వార్థంతో కూడిన చీకట్లను పారద్రోలి, మంచి అనే దీపాన్ని వెలిగించి పది మందికి వెలుతురును ఇవ్వాలని పిలుపునిచ్చారు. పండుగ సంబరాల్లో భాగంగా పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు ప్రమాదాలకు తావులేకుండా కుటుంబ పెద్దలు ఖచ్చితంగా దగ్గరుండి తగిన జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎల్లప్పుడూ ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా, సోదర భావంతో మెలుగుతూ నగర ప్రశాంతతకు తోడ్పడాలని కమిషనర్ తన సందేశంలో పేర్కొన్నారు.

పిఏసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మధ్య దళారీలను ఆశ్రయించి రైతులు మోసపోవద్దు

వలిగొండ నవంబర్ 7 ప్రజాకలం:రైతులు వరి దాన్యం అమ్మకాలలో మధ్య దళారీలను ఆశ్రయించి నష్ట పోవద్దని అరూర్ పిఏసిఎస్ చైర్మన్ చిట్టెడి వెంకట్ రామ్ రెడ్డి అన్నారు. శనివారం పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలు అరూర్,గురునాధ్ పల్లి,వెంకటాపురం,చిత్తపురం,గోపరాజ్ పల్లి గ్రామాలలో ప్రారంభించి వారు మాట్లాడుతూ రైతులు మధ్య దళారీలను ఆశ్రయించవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సుక్క ముత్యాలు,ఆవుల నర్సింహా,కర్నెకంటి కలమ్మ యాదయ్య,సలిగంజి పృద్వి మాజీ ఎంపిపి చిట్టెడి జనార్ధన్ రెడ్డి,మాజీ సర్పంచులు జినుకల దానయ్య,పోలేపాక చెమ్మయ్య,పిఏసిఎస్ డైరెక్టర్లు కోడితాల నాగరాజు,ఆవుల స్వామి,గన్నెబోయిన నర్సింహా,కర్నెకంటి మల్లేశం,చేగూరి మచ్చగిరి సిఈఓ బోడ కృష్ణ,నాయకులు బండారు నర్సింహా రెడ్డి,చిలకమర్రి కనకాచారి వార్డు మెంబర్లు ఆవుల బిక్షపతి,వెలిమినేటి సంతోష్,క్యాదరీ నరేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.





అల్లం బుచ్చమ్మకు ప్రముఖుల అశ్రునివాళి

- అంత్యక్రియలకు హాజరైన రాజకీయ, జర్నలిజం రంగాల ప్రముఖులు..
కుటుంబ సభ్యులకు పరామర్శ

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 07 (ప్రజా కలం ప్రతినిధి) : తెలంగాణ ప్రెస్ అకాడమీ తొలి చైర్మన్, సీనియర్ జర్నలిస్టు అల్లం నారాయణ మాతృమూర్తి అల్లం బుచ్చమ్మ మృతి పట్ల పలువురు రాజకీయ, జర్నలిజం రంగాల ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంథని మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన బుచ్చమ్మ వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. శనివారం నిర్వహించిన ఆమె అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖఔజెజీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్ పాషా, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె. శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బుచ్చమ్మ పార్థివదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అల్లం నారాయణతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని బుచ్చమ్మకు అంతిమ వీడ్కోలు పలికారు.

'రక్షకుడు' లఘు చిత్రానికి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు

పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న దర్శక నిర్మాత బీరప్ప

సిద్దిపేట, నవంబర్ 07 (ప్రజా కలం ప్రతినిధి):

పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజల రక్షణలో వారి పాత్రను ప్రతిబింబిస్తూ దర్శక నిర్మాత (బీఆర్‌పీ) బీరప్ప రూపొందించిన 'రక్షకుడు' లఘు చిత్రానికి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. పోలీస్ ఫ్లాగ్ డే వేడుకల సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ చేతుల మీదుగా దర్శక నిర్మాత బీరప్పతో పాటు చిత్ర బృందం సభ్యులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసుల విధి నిర్వహణతో పాటు వారి మానవీయ కోణాన్ని సమాజానికి తెలియజేసేలా లఘు చిత్రాలను




రూపొందించడం అభినందనీయమన్నారు. పోలీసుల సేవలు, త్యాగాలను ప్రతిబింబిస్తూ 'రక్షకుడు' చిత్రాన్ని రూపొందించిన దర్శక నిర్మాత బీరప్పతో పాటు చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల చిత్ర బృందం హర్షం వ్యక్తం చేసింది. తమ ప్రయత్నాన్ని గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన పోలీస్ కమిషనరేట్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. దర్శక నిర్మాత బీరప్పకు గతంలో ఒక రాష్ట్రస్థాయి అవార్డుతో పాటు రెండు జిల్లా స్థాయి అవార్డులు లభించాయి. తాజాగా 'రక్షకుడు' లఘు చిత్రానికి మరో జిల్లా స్థాయి పురస్కారం దక్కడంతో ఆయనకు మరోసారి గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో నటులు బిక్షపతి,సోనీ,స్వామి, శంకరమ్మ, కుమార్,భాను,బి.రాజు, కే.రాజు, డైరెక్షన్ టీమ్ సభ్యులు రామ్,కలీం,పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్మూర్ ప్రజలకు బౌద్ధ దీపావళికి ఆహ్వానం

నిజామాబాద్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 07:

ఆర్మూర్ పట్టణంలో "బౌద్ధ జ్ఞాన దీపావళి" వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. సిద్ధార్థ గౌతముడు కపిలవస్తుకు తిరిగి వచ్చిన సందర్భంగా నగర ప్రజలు దీపాలతో స్వాగతం పలికిన రోజును చరిత్ర పొడవున "బౌద్ధ జ్ఞాన దీపావళి"గా జరుపుకుంటారని నిర్వాహకులు తెలిపారు. యశోబుద్ధ ఫౌండేషన్ తెలంగాణ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆర్మూర్, అల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్, అంబేద్కర్ యువజన సంఘం నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో సిటీలోని హౌసింగ్ బోర్డు లోని బుద్ధుడి విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. వచ్చేటపుడు కుటుంబం, ప్రతి వ్యక్తి, కార్యకర్త తెల్లని దుస్తులు ధరించి, దీపాలు క్యాండిల్ తో రావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.





ఎం ఎస్ ఎఫ్ ను సంస్థాగతంగా

బలోపేతం చేసుకుందాం

- సమాజహితం , సామాజిక న్యాయం సమానత్వం కోసం పోరాడుదాం
- విద్యార్థుల ద్వారానే ఉద్యమాలు విజయవంతం
- ఎమ్మార్పీఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల మాదిగ.

మహేశ్వరం, నవంబర్ 07,(ప్రజా కలం).

ఎస్సీ వర్గీకరణను సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించుకున్న తరువాత కుల, మత, వర్గ లింగ వివక్షత లేని సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని సమాజహితం, సామాజిక న్యాయం , సమానత్వం కోసం భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధమవుతుందని ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు.తుక్కుగూడ శ్రీ కళాశ్రీ గార్డెన్స్ నందు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి,ఎం ఎస్ ఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశం ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఇంచార్జిలు రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ లు మాట్లాడుతూ " ప్రపంచంలో ఏ ఉద్యమం విజయం సాధించినా దాని వెనుక విద్యార్థి శక్తి దాగి ఉందని అన్నారు.అలాగే ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయం సాధించడానికి మాదిగ విద్యార్థులు కూడా అద్వితీయ పాత్రను పోషించారని అన్నారు .అయితే దేశంలో ఏండ్ల తరబడి సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు తీవ్రంగా కొనసాగుతున్నాయని అన్నారు.కుల మత లింగ వివక్షత ప్రజల్ని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. అందువల్ల దేశంలో సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వం రావాల్సిన అవసరం ఉందని అన్నారు.అలాగే అన్ని రకాల వివక్షతలు తొలగిపోవాలని అన్నారు.అందుకోసం మహనీయుల బాటలో భవిష్యత్తు ఉద్యమానికి మంద కృష్ణ మాదిగ శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ పోరాటం శక్తివంతంగా ముందుకు సాగాలంటే విద్యార్థులు ఉద్యమంలో భాగస్వాములు కావాలని అన్నారు.అందుకోసం విద్యార్థుల్లో చైతన్యం పెంపొందిస్తూ ప్రతి విద్యా సంస్థలో ప్రతి హాస్టల్లో నూతన MSF కమిటీలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి గ్రామంలో ప్రతి మండలంలో మీఖీ కమిటీలు వేయాలని అన్నారు.నవంబర్ 22లోపు క్షేత్రస్థాయిలో విద్యార్థులతో సమావేశాలు జరిపి నూతన మీఖీ జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి వారిని భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.ఆల్మస్గూడ దళిత క్రైస్తవ అమ్మాయిల దాడి ఘటనపై అరెస్టు చేసిన వ్యక్తి ఎవరో వారి వివరాలను పోలీసులు బహిర్గతం చేయాలని భాధిత అమ్మాయిలు ఎవరి అధీనంలో ఉన్నారో తెల్చాలని కోరారు. మతవైశ్యమ్యాలు లేకుండా రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదని, చట్టాన్ని చేతులకు తీసుకొని మహిళలు అని చూడకుండా దాడులకు పాల్పడడం మంచి సంస్కృతి కాదని గుర్తుచేశారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా తెలియజేయాలి కానీ దాడులు చేయడానికి మీరు ఎవరని..? ఇలాంటి ఘటనల మీద ప్రభుత్వం పోలీసు వ్యవస్థ సీరియస్ గా వ్యవహరించాలని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు మేడ్చల్ జిల్లా ఇన్చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఆల్ ఇండియా క్రైస్తవ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు విజయరావు, ఎమ్మెల్సీ మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, మేడ్చల్ మాజీ అధ్యక్షులు కేశపాక రామచంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ,నాని భానుప్రసాద్ మాదిగ, మహేశ్వరం మండల అధ్యక్షులు ప్రభాకర్ మాదిగ, జిల్లా మాజీ అధికార ప్రతినిది పోతుగంటి కృష్ణ మాదిగ, ఎర్ర కృష్ణ మాదిగ, ఎర్ర నవీన్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎర్ర గణేష్ మాదిగ, కాడిగాళ్ల ప్రవీణ్ మాదిగ, బుస్సన్న గారి శేఖర్ మాహిష్మ మండల ఉపాధ్యక్షులు నడి కూడా అర్జున్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పెండ్యాల వంశీ మండల ఉపాధ్యక్షులు వికారాబాద్ రంగారెడ్డి మూడు జిల్లాలకు సంబంధించిన ప్రధాన నాయకత్వం తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం భవనం

జోలికొస్తే ఉపేక్షించేది లేదు

- సంఘ ఆస్తులకు రక్షణ కల్పించాలి..
-దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ పద్మశాలి కోపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్

గజ్వేల్ నియోజకవర్గం: 07 నవంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం నాచారం గ్రామంలోని అఖిల భారత పద్మశాలి నిత్యాన్న సత్ర సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు.ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు పద్మశాలి సంఘం ప్రధాన గేటును ధ్వంసం చేసిన ఘటనపై సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్,సంఘం ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. పద్మశాలి సంఘానికి చెందిన భవనం,ఆస్తుల జోలికి వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.సంఘ ఆస్తులకు నష్టం కలిగించే ప్రయత్నాలను చట్టపరంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాచారం, అంతగిరిపల్లి,వేలూరు గ్రామాల పరిధిలోని కొన్ని స్థలాలకు సంబంధించి గతంలో విక్రయాలు జరిగినప్పటికీ, ప్రస్తుతం కొందరు వ్యక్తులు వారసులమంటూ వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని నాయకులు ఆరోపించారు. నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సంబంధించిన భూముల విషయంలోనూ వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు.పద్మశాలి సంఘం ప్రధాన గేటు ధ్వంసం చేస్తున్న సమయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని సమావేశంలో నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలోనే ఘటన జరిగినప్పటికీ స్పందన ఆశించిన స్థాయిలో లేదని ఆరోపించారు. సంఘానికి సంబంధించిన భూములు, ఆస్తులకు రక్షణ కల్పించాలని, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.సంఘంలో అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పద్మశాలీలందరూ ఐక్యంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సుతో పాటు సంఘ ఆస్తులు, హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది తలకొక్కుల రాజు,ట్రస్ట్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవదాస్, గజ్వేల్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు తలకొక్కుల రాజేశం తదితరులతో పాటు గజ్వేల్ నియోజకవర్గంలోని పద్మశాలి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రోడ్లపై వరి ధాన్యం ఆరబోయొద్దు

ప్రమాదాలకు కారణం కావొద్దు.

రాయపోల్ ఎస్ఐ బి.లింగం.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 07.

పండించిన పంటను కష్టపడి ఇంటికి చేర్చుకుంటున్న రైతులు ధాన్యం ఆరబెట్టే విషయంలోనూ తగిన జాగ్రత్తలు పాటించాలని రాయపోల్ ఎస్ఐ బి.లింగం సూచించారు. వరి కోతల సీజన్‌లో చాలామంది రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్లపై ధాన్యం కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు తమ అవసరాల కోసం రోడ్లను ధాన్యం ఆరబెట్టే ప్రదేశాలుగా ఉపయోగించుకోవద్దని కోరారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పే ప్రమాదం ఉందని, ఇతర వాహనాల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతుందని వివరించారు. రైతులు తమ పొలాల వద్ద, కల్లాల్లో లేదా ఇతర అనువైన ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. రైతులు ఒక్కసారి ఆలోచించాలి.. మనం రోడ్లపై ఆరబెట్టే ధాన్యం వల్ల ఎదుటివారి ప్రాణాలకు ముప్పు కలగకూడదు. రైతుల భద్రతతో పాటు ప్రయాణికుల ప్రాణాల రక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సై పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు రైతులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



గుడికి కేటాయించిన స్థలంలోనే నిర్మాణం చేపట్టాలి

గజ్వేల్ నియోజకవర్గం: 07 నవంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలోని బైలంపూర్ గ్రామపంచాయతీకి చెందిన తానేదార్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులు ఆందోళన



నిర్వహించారు.గతంలో ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలోనే పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో హనుమాన్ మందిరం,ఎల్లమ్మ దేవాలయం, దుర్గమ్మ ఆలయాల నిర్మాణానికి స్థలాలు కేటాయించడంతో పాటు నిధులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. పెద్ద ఆలయాలకు రూ. 8 లక్షలు, చిన్న ఆలయాలకు రూ. 2 లక్షల చొప్పున నిధులు కేటాయించి, కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం నిధుల విడుదల నిలిచిపోవడంతో ఆలయాల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా,గతంలో హనుమాన్ ఆలయానికి కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గతంలో ఆలయానికి కేటాయించిన స్థలంలోనే హనుమాన్ మందిర నిర్మాణం పూర్తిచేయాలని కోరారు.సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

కొల్గురు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సర్పంచ్ గొడుగు స్వామి

గజ్వేల్, నవంబర్ 07 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ మండలంలోని కొల్గురు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామ సర్పంచ్ గొడుగు స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు వడ్లు తీసుకువచ్చిన వెంటనే ఎలాంటి పక్షపాతానికి, రాజకీయాలకు తావులేకుండా అందరికీ సమాన ప్రాధాన్యతనిస్తూ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం తూకం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.అదేవిధంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొనుగోలు కేంద్రాల వద్ద అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు




అల్మాస్గూడ లింక్ రోడ్డులో

చెత్త కుప్పలు డ్రైనేజీ మురికితో భయానకం

ప్రజల ప్రాణాలతో చెలగాటం

స్పందించకపోతే కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా - సీపీఐ ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి



మహేశ్వరం , నవంబర్ 07, (ప్రజా కలం)

బాలాపూర్ మండలం అల్మాస్గూడ లోని వైయస్ఆర్ ఫేస్-1 కాలనీ, వినాయక్ నగర్ కాలనీ, మాల్ రెడ్డి రంగారెడ్డి కాలనీ మధ్యన ఉన్న అల్మాస్గూడ గ్రామానికి లింక్ రోడ్డు ప్రస్తుతం చెత్త చెదారంతో నిండిపోయి, డ్రైనేజీలోని మురికి నీరు ఉప్పొంగి భయానక వాతావరణాన్ని తలపిస్తోంది.రోడ్డుపై చెత్తతో పాటు విషపూరిత పాములు సంచరిస్తుండగా, చనిపోయిన కుక్కలు, వందులను రోడ్డు పైనే వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయింది. దీంతో కాలనీవాసులు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. పట్టించుకునే నాథుడు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

మున్సిపల్ నిర్లక్ష్యమే కారణం

ఈ దుస్థితికి మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైయస్ఆర్ కాలనీ ఫేస్-1 కు నాలుగైదు రోజులకు గాని చెత్త ఊడ్చడానికి సిబ్బంది రావడం లేదని మండిపడుతున్నారు."కరెంట్ బిల్లు ఒక్కరోజు లేట్ అయితే కరెంట్ కట్ చేసి పోయే అధికారులు, ఇంటి పన్ను కట్టకపోతే నోటీసులు ఇచ్చే పెద్దలు, పేదవాడిపై ఉప్పుకు, పప్పుకు, నూనెకు, ప్రతి వస్తువుపై ట్యాక్స్ వసూలు చేసే మున్సిపల్ వారికి ఈ చెత్త కనబడడం లేదా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

ఈ విషయాన్ని ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా, మున్సిపల్ అధికారులకు వినతి పత్రం ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేకపోయిందని స్థానికులు చెబుతున్నారు.

సీపీఐ హెచ్చరిక ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి

ఇప్పటికైనా ఈ విషయంపై స్పందించి కాలనీలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, మున్సిపాలిటీ డ్రైనేజీలను త్వరలో బాగు చేయాలని లిబాలాపూర్ మండల సీపీఐ పార్టీ కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.లేని పక్షంలో బాలాపూర్ మండల సీపీఐ పార్టీ తరఫున పెద్ద ఎత్తున మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.



జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం కల్పించాలి.. -టీజేపీ జిల్లా అధ్యక్షుడు షానూర్‌బాబా

బీబీనగర్, నవంబర్ 07 (ప్రజాకలం): జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మొహమ్మద్ షానూర్‌బాబా కోరారు. శనివారం బీబీనగర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత ఇళ్లు, ఇంటి స్థలాలు లేక అనేకమంది జర్నలిస్టులు అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకొస్తూ సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు, అర్హులైన వారికి ఇందిరమ్మ గృహ పథకంలో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు చేసి వారి సొంత ఇంటి కలను నెరవేర్చాలని అన్నారు. ఈ సమావేశంలో టీజేఏ బీబీనగర్ మండల అధ్యక్షుడు రెడ్డబోయిన మహేష్, కార్యదర్శి మంచాల అనిల్, ఇంద్రియాల శివాజీ, పాముకుంట్ల ఉషాకిరణ్, బింగి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.







దీపావళి సందర్భంగా శ్మశానవాటికల్లో

ప్రత్యేక పారిశుధ్య పనులు

- మైనంపల్లి హనుమంతరావు చొరవతో విద్యుత్ దీపాల ఏర్పాటు

మల్కాజిగిరి, నవంబరు 7 (ప్రజా కలం ప్రతినిధి): మౌలాలి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 186వ డివిజన్‌లో దీపావళి పండుగను పురస్కరించుకుని శ్మశానవాటి కల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక చొరవతో ఈ ఏర్పాట్లు చేపట్టారు. తెలుగు సంప్రదాయం ప్రకారం దీపావళి పండుగ సందర్భంగా శ్మశానవాటికల్లో ప్రత్యేక పూజలు నిర్వహించే ఆచారం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మైనంపల్లి హనుమంతరావు సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు లేఖ అందజేసి, గాంధీనగర్, హనుమాన్ నగర్, మారుతి నగర్, క్రియేటివ్ నగర్‌తో పాటు 186వ డివిజన్ పరిధిలోని అన్ని శ్మశానవాటికల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు తగిన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆయన ఆదేశాలు, చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, సీనియర్ నాయకులు నర్సింగరావు, చంద్రకాంత్, నాగేశ్వరరావు, రమేష్, రామాంజనేయులు, అత్తర్, మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, సాయి, కుమార్ తదితర నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు. పండుగ సమయంలో ప్రజల అవసరాలను గుర్తించి శ్మశానవాటికల్లో ముందస్తు ఏర్పాట్లు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి..

పండుగ వేళ లబ్ధిదారుల ఆవేదన
జిల్లా వ్యాప్తంగా వేడుకలకు కలెక్టర్ ఆదేశాలు..
ఇళ్లు పూర్తి చేసినా అందని చివరి విడత బిల్లులు..
అప్పుల భారంతో లబ్ధిదారుల అవస్థలు



బీబీనగర్, నవంబరు 07 (ప్రజాకలం): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపాల వెలుగులు నింపేందుకు ప్రభుత్వం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 8న (ఆదివారం) జిల్లా వ్యాప్తంగా పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు దీపాలు వెలిగించి, గ్రూప్ ఫొటోలు తీసి అధికారిక మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డులో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ముందు, తర్వాత ఫొటోలతో స్లైక్సీలు ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి శుభాకాంక్షలు తెలియజేయాలని ఆదేశించారు. అయితే, ఈ వేడుకల వేళ మొదటి విడతలో ఇళ్లు మంజూరై నిర్మాణాలు పూర్తి చేసుకున్న పలువురు లబ్ధిదారులకు చివరి విడత బిల్లులు అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లుల కోసం ఎదురుచూస్తూ, నిర్మాణ పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం కొనసాగుతుండగా, మరోవైపు మొదటి విడతలో ఇళ్లు పూర్తి చేసుకున్న వారికి బకాయిలు అందకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పండుగ వేళైనా బిల్లులు అందేనా?

సొంతింటి కల నెరవేరిందన్న ఆనందం ఉన్నా, నిర్మాణానికి చేసిన అప్పులు భారంగా మారాయని లబ్ధిదారులు వాపోతున్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలతో పాటు తమ ఇళ్లకు రావాల్సిన చివరి విడత బిల్లులు కూడా విడుదల చేస్తే పండుగ ఆనందం రెట్టింపవుతుందని ఆశిస్తున్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులపై స్పందించి త్వరగా చెల్లింపులు చేపట్టాలని కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్ పాట్లోళ్ల శ్యామ్‌గౌడ్

బీబీనగర్, నవంబర్ 07 (ప్రజాకలం): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పాట్లోళ్ల శ్యామ్‌గౌడ్ సూచించారు. శనివారం మండలంలోని గుర్రాలదండి, జంపెల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో గుర్రాలదండి సర్పంచ్ ధరావత్ గోపీనాయక్, జంపల్లి సర్పంచ్ నాగరాజు, ఏపీఎం మీనా, పీఏసీఎస్ డైరెక్టర్ బానోతు వినోద్‌నాయక్, ఎస్టీ సెల్ నాయకులు రాములునాయక్, రాజునాయక్, వార్డు సభ్యులు, అధికారులు, రైతులు, మహిళా సంఘాల నాయకురాలు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com